J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12 THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 14 5.9.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ● బలపడుతున్న బంధం

# అటు కలహం.. ఇటు స్నేహం



పెత్తందారీ పోకడలకు పోతూ భారత్‌ను చెరపట్టిన అమెరికాకు గర్వభంగం, ఉగ్రమూకలకు స్థావరంగా ప్రపంచానికి శాపంగా అవతరించిన పాకి(పి)స్థాన్‌కు శరాఘాతం, ఆంక్షల బూచి చూపిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న యూరప్‌కు అశనిపాతం... అనేలా యురేషియా (ఆసియా+ ఐరోపా)లో త్రైపాక్షిక కూటమికి నాందీ ప్రస్తావన జరిగింది. అగ్రరాజ్యం అమెరికా ఏకధ్రువ ప్రపంచానికి చెక్ చెప్పేందుకు భారత్, రష్యా, చైనా ఒకే వేదికపై చేతులు కలిపాయి.

- విదేశాంగ విధానంలో కీలక మార్పులు
- చారిత్రాత్మక బంధం వైపు భారత్ చూపు
- రష్యా, చైనాలతో త్రైపాక్షిక కూటమి దిశగా అడుగులు
- అమెరికాకు చెక్ పెట్టే వ్యూహంలో మోడీ మార్క్ చతురత

ప్రపంచ జనాభాలో మూడో వంతుకుపైగా ప్రాతినిధ్యంతో పాటు, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన ఈ దేశాల పొత్తు పెద్దన్న అమెరికా అధిపత్యానికి పెనుసవాలే. ఇక టారిఫ్‌లతో మనల్ని బెదిరిస్తూ, నోరుపారేసుకుంటున్న ట్రంప్‌కు చుక్కలు చూపించేలా తమదైన వ్యూహాలతో మన ప్రధాని నరేంద్ర మోడీ దూసుకెళ్తున్నారు. అటు జపాన్‌తో ఆరులక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడుల ఒప్పందం చేసుకుంటూనే, ఇటు బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్యం, చైనాకి స్నేహహస్తం అందించి, మాకు చెలిమే కాదు, మిమల్ని చెడుగుడు ఆడుకునే సత్తా కూడా ఉందంటూ అమెరికాకు గట్టి సంకేతాలిచ్చేశారు.

### ఊహించిందే నిజమైంది!

అంతర్జాతీయ స్థాయిలో కొత్త శకం మొదలైంది. తద్వారా చరిత్రలో అరుదైన కలయిక సాక్షాత్కారమైంది. చైనాలోని తియాంజిన్ వేదికగా జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కలిసి ప్రపంచ రాజకీయాల్లో కొత్త సమీకరణలకు నాందిపలికారు. సిద్ధాంతాల పరంగా ఉత్తరధ్రువం–దక్షిణధ్రువంలా వ్యవహరించే చైనాతోనూ సంధికాల స్నేహానికి సై అంటూ పచ్చజెండా ఊపేశారు. ఎలాగూ రష్యాతో మన బంధం అమోఘం కావడంతో, చరిత్రలోనే అరుదైన ప్రజాస్వామ్య–కమ్యూనిస్టు త్రైపాక్షిక కూటమికి అడుగు ముందుకు పడింది. దీంతో తమ నంబర్–1 స్థానానికి ఎసురొస్తుందని గ్రహించిన అమెరికా, లేని ప్రేమను భారత్‌పై ఒలకబోస్తూ, చైనా మేకవన్నె పులని, రష్యా నమ్మదగ్గ మిత్రుడు కాదంటూ హెచ్చరికల పేరుతో మనకు హితబోధ చేసే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచంలోనే అతి పురాతన ప్రజాస్వామ్య దేశం తమదని, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అంటూ కమ్మని మాటలతో కలుపుకునే ప్రయత్నాలు చేస్తోంది. మనం.. మనం ఒకటే అంటూ సన్నాయినొక్కులు నొక్కుతోంది. ఇక భారత్, చైనా, రష్యా కూటమిలోకి, దక్షిణ అమెరికా ఖండంలో పెద్దదేశమైన బ్రెజిల్, ఆఫ్రికా ఖండంలో అభివృద్ధి చెందిన దక్షిణాఫ్రికా, మధ్య ఆసియాలో ఆర్థికంగా బలమైన సౌదీ అరేబియా కలుస్తాయనే ఊహాగానాలు ప్రపంచ రాజకీయ స్వరూపాన్నే మార్చేసేలా కనిపిస్తున్నాయి.

### అచ్చమైన దీర్ఘదర్శి.. మచ్చలేని మార్గదర్శి!

భారత ప్రధాని మోడీ... ప్రస్తుతం అంతర్జాతీయ రాజకీయాల్లో ఈ పేరు మారుమోగుతోంది.

10లో

# శ్రీధర్‌రెడ్డిని చంపించాలనుకుంది ఎవరు?

## పోలీసులే నిగ్గు తేల్చాలి

## నేరపురిగా మారుతున్న సింహపురి!

నెల్లూరుజిల్లా నేర సామ్రాజ్యంలో అకస్మాత్తుగా మెరిసిన లేడీ డాన్ నిడిగుంట అరుణ కథ అనేక మలుపులు తిరుగుతోంది. "రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని చంపేస్తే...." అని ఓ రౌడీ గ్యాంగ్ హోటల్ గదిలో మాట్లాడుకున్న వీడియో బయటకి రావడంతో, హంతకుడు శ్రీకాంత్ పెరోల్ వ్యవహారంలో కూడా అనేక అనుమానాలు తెరపైకి వస్తున్నాయి. అతి ప్రశాంతమైన నెల్లూరులో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న నేర ఉదంతాలను గమనిస్తుంటే సింహపురి 'నేరపురి'గా మారిపోయిందా...? అన్న ఆందోళన కలుగుతోంది.

ప్రశాంత రాజకీయాలకి, స్నేహపూరిత రాజకీయ అనుబంధాలకి మారుపేరు నెల్లూరు. అయితే అది 2019కి ముందు మాట. 2019 తరువాత రాజకీయాలు మారిపోయాయి. రాచకీయాలుగా అవతరించాయి. వ్యక్తిగత ద్వేషాలు పెరిగిపోయాయి. రాజకీయ పోరు కాస్తా ఆధిపత్య పోరాటంగా మారిపోయింది. ముఠాలుగా, వర్గాలుగా రాజకీయ నేతలు విడిపోయారు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకునే స్థాయికి నాయకులే దిగజారిపోయారు. వారి బాటలోనే వారి అనుయాయులు కూడా నడిచారు. ఈ కొత్త సంప్రదాయంతో రాజకీయ ముసుగులో రౌడీ గ్యాంగులు తెరమీదకి వచ్చాయి. తమ నాయకుడి నీడలో అరాచకాలు చేయడం ప్రారంభించాయి. విమర్శకి ప్రతి విమర్శ కాకుండా నేరుగా వ్యక్తిగత దాడులకు దిగాయి. తమ నాయకుడి జోలికి వచ్చినా, బహిరంగంగా విమర్శించినా అంతుచూస్తాం అనే స్థాయిలో పెట్రేగిపోయాయి. నాయకులు కూడా తగ్గలేదు. తమ చుట్టూ రౌడీషీటర్లని పెట్టుకున్నారు. తమ ప్రత్యర్థులు సొంత పార్టీ వారైనా సరే ఒకరినొకరు బహిరంగంగానే హెచ్చరించుకున్నారు. వారి వారి నియోజకవర్గాలని తమ స్వంత రాజ్యాలుగా (టెరిటరీలుగా) చేసుకుని పాలన సాగించారు. ఈ క్రమంలో జిల్లా రాజకీయాలే ముఠా తగాదాలకు వేదికగా మారిపోయాయి. రౌడీయిజం శృతిమించింది. వ్యక్తిగత దాడులు పెరిగిపోయాయి. దౌర్జన్యాలు, దుర్మార్గాలు, అరాచకాల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఈ రౌడీ గ్యాంగులకి అధికార పార్టీ నేతలే అండగా ఉండడంతో పోలీసు శాఖ కూడా చూసీ చూడనట్లు ఉండిపోయింది. ఒక తరుణంలో ఎవరైనా స్టేషనుకి నేరుగా వెళ్ళి రాజకీయ నాయకుడి రౌడీ అనుయాయులపై ఫిర్యాదు చేసినా ఆ ఫిర్యాదుని స్వీకరించలేని నిస్సహాయ స్థితిలో పోలీసుశాఖ ఉండిపోయింది. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సైతం ఈ ముఠా తగాదాల మధ్య నలిగిపోయారు.

### సంచలనంగా మారిన వరుస సంఘటనలు!

ఇప్పుడు తాజాగా నరహంతకుడు శ్రీకాంత్ పెరోల్ వ్యవహారంలో అనూహ్యంగా నిడిగుంట అరుణ పేరు బయటకి రావడం, ఆమె అరెస్టు కావడం, ఆమె అరాచకాలు ఒక్కొక్కటి వెలుగు చూడడం, శ్రీకాంత్ పెరోల్ రద్దయి ఆయన్ని విశాఖ జైలుకి మార్చడం, శ్రీకాంత్ పెరోల్ విషయంపై శ్రీధర్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి

2లో

## ప్రతిభాపాటవాల సిరి.. విజ్ఞాన వెలుగుల ఝరి

# మాస్టారు.. మీరే మా 'స్టారు'..!

### సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేకం

- జ్ఞాన బోధనలో ఉపాధ్యాయులే దివిటీలు
- కాలమెంతమారినా.. కరిగిపోనిది.. తరిగిపోనిది విద్యే
- గురువులే.. సమాజానికి మార్గనిర్దేశకులు



## అంతరంగం

అకారాది క్రమంలో ముందుండేది అమ్మయినా.. నిజజీవితంలో.. ఆలోచనా శక్తికి పురుడుపోసి.. విచక్షణాశక్తికి వీలు కల్పించి.. విద్యార్థికి దారిచూపే దార్శనికుడు మాత్రం ఉపాధ్యాయుడే. అందుకే మన పెద్దలు తల్లిదండ్రుల తర్వాత స్థానాన్ని ఉపాధ్యాయులకే ఇచ్చారు. ఆ దైవం కూడా ఉపాధ్యాయుల తర్వాతే అని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గుర్తెరిగి.. ఎందరో మహాత్ములైన గురువులు.. విద్యార్థులను తమ బిడ్డలుగా భావించి వారి జీవితాలను తీర్చిదిద్దేందుకు.. నిర్విరామంగా పనిచేసి.. కితాబులందుకున్నారు. ఈ క్రమంలో తమకున్నదంతా శిష్యుల కోసం వెచ్చించిన మహానుభావులు, త్యాగమూర్తులూ ఉన్నారు. ఇక నాణేనికి బొమ్మ బొరుసూ ఉన్నట్లే.. ఇదే సమయంలో ఈ ప్రపంచాన్ని నడిపిస్తూ.. మనిషిని ఆడించే మనీ కోసం ఆశపడి.. తమ ఉద్యోగ ధర్మాన్ని నిజాయితీతో నిర్వర్తించక.. బాధ్యత మరిచి.. విద్యార్థుల భవిష్యత్‌ను నీరుగార్చే ఎందరో గురుపుంగవులు మనచుట్టూనే ఉన్నారు. అక్కడక్కడా అభంశుభం తెలియని అమాయక విద్యార్థినుల జీవితాలనూ కాటేసిన కాలయముళ్లూ తారసపడుతుంటారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ వృత్తి ఏ రూపును సంతరించుకుంటోంది.. ఏ తీరాల వైపు పయనిస్తుందో సింహావలోకనం చేసుకోవడం తప్పనిసరి.

### కాలగమనంలో.. బోలెడు మార్పులు..

బోధన అభ్యాసన ప్రక్రియ రోజురోజుకూ హైటెక్ సొబగులు అందుకుంటూ.. అంతులేని వేగంతో దూసుకెళ్తోంది. ఒకప్పుడు గురువు మౌఖికంగా చెప్పిన అంశాన్నే విద్యార్థి యథాతథంగా వల్లెవేయడం, బట్టీపట్టి అప్పజెప్పడం విద్యాభ్యాసంగా భావించేవారు. అయితే.. ప్రస్తుతం తనంతట తానుగా పరిశోధనా దృక్పథంతో, ప్రయోగాత్మకంగా ఓ విషయాన్ని ఆకళింపు చేసుకునే విద్యార్థికి.. గురువు సహాయకారిగా, మార్గదర్శకుడిగా వ్యవహరిస్తూ తన పాత్రను సరికొత్తగా పోషిస్తున్నాడు. వేదకాలంలో ఎంతటి సిరిసంపదలు కలిగివున్నా.. ఎంతటి యువరాజులైనా.. దైవాంశసంభూతుల సంతానమైనా.. బాల్యదశలో తల్లిదండ్రులను వదిలి గురుకులానికి వెళ్లి గురువుకు సేవచేస్తూ భక్తితో విద్యనభ్యసించాల్సి వచ్చేది. అయితే, అన్ని రంగాలతో పాటు విద్యారంగంలోనూ ఊహించని మార్పులొచ్చి.. ప్రస్తుతం ఉపాధ్యాయులే విద్యార్థుల సమూహమైన పాఠశాల వద్దకు వెళ్లి జ్ఞానబోధ చేస్తున్నారు. ఈ క్రమంలో గురువు ప్రాధాన్యత ఎంతగా మారింది.. గురువు స్థానం ఎలాంటి పోకడలకు తెర తీసింది. ఎలాంటి స్థితికి చేరింది.. గాడితప్పకుండా ఉండాలంటే ఎలాంటి సంస్కరణలు అవసరమో..ఓ సారి.. పరిశీలించాల్సి అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే యుగాలు మారినా.. తరాలు మారినా.. ప్రతి ఒక్కరికీ వారివారి ఫస్ట్ హీరో గురువే కాబట్టి..! మరి ఫస్ట్ చాయిస్ బెస్ట్ చాయిస్ కాకపోతే..?ఆదిలోనే హంసపాదు ఎదురైతే.. ఆ విద్యార్థి జీవితం తలక్రిందులు కావడం ఖాయం. ఆ పరిస్థితులు రాకూడదంటే.. ఉపాధ్యాయులు, విద్యార్థులే కాదు.. సమాజం.. ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకోవాల్సిందే. దారి తప్పుతున్న దివిటీని సగర్వంగా ఎత్తిపట్టుకుని నడిచే వారికి చేదోడు వాదోడుగా ఉండాల్సిందే.

నిజానికి ఒకప్పుడు దైవాంశసంభూతుడిగా భావించే ఉపాధ్యాయుడి పాత్ర.. నేడు సినిమాల్లో జోకర్ క్యారెక్టర్‌లకే పరిమితమవుతోందంటే అతిశయోక్తి కాదేమో. అదే క్రమంలో ప్రభుత్వం నుంచి వేలల్లో జీతాలు పొందుతూ.. తమ వ్యాపకాల కోసం బోధనను అటకెక్కించి.. రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారలంటూ క్లాస్ రూంలోనే ఫోన్ చర్చలు సాగించే ఉపాధ్యాయులూ ఉన్నారు. ఇక తల్లిదండ్రులకు మ్యాజిక్ మంత్ర అనే స్థాయిలో చిత్రవిచిత్ర సబ్జెక్టులతో విద్యార్థులకు పిచ్చిపట్టించే ప్రైవేటు యాజమాన్యాలకూ కొదవ లేదు. ఇక పూటగడవని స్థాయిలో జీతం అందుకుంటూ విద్యార్థుల కోసం పరితపించే ప్రైవేటు ఉపాధ్యాయులూ మనకు కనిపిస్తుంటారు. ఈ సమస్యలు తొలగిపోవాలంటే సమాజాన్ని పాఠశాలతో అనుసంధానం చేయాలి. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారితో విద్యార్థులు అప్పుడప్పుడైనా కలుసుకునే అవకాశం కల్పించాలి. వనభోజనాలు, వినోద విజ్ఞాన పర్యటనలనూ వీలైనంత ఎక్కువగా విద్యాప్రణాళికలో చేర్చాలి. ప్రభుత్వ ఉపాధ్యాయులకు విద్యాబోధన తప్ప ఇతర బాధ్యతలు కేటాయించకూడదు. ప్రైవేటు ఉపాధ్యాయులకూ ఆత్మగౌరవంతో బతికేలా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి ఆర్థిక సహకారం అందించాలి. అప్పుడే భావిభారతం విజ్ఞాన బాండాగారమై విలసిల్లుతుంది.

### మార్పుల 'పాఠం' తప్పనిసరి..

ప్రస్తుతం నర్సరీలోనే విద్యార్థికి ప్రపంచ నాగరికతలపై అవగాహన కల్పించేస్తాం అనేలా.. కార్పొరేట్ స్కూళ్ల తల్లిదండ్రులకు అరచేతిలో స్వర్గం చూపించేస్తున్నాయి. డిజిటల్ బోధన, కంప్యూటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) తరగతులంటూ బోధనకు సరికొత్త మెరుగులద్దుతున్నాయి. అయితే ఏ విద్యార్థి సామర్థ్యం ఏంటో.. ఏ విద్యార్థికి ఎందులో ఆసక్తి ఉందో.. అతడి సహజ గుణగణాలేంటో.. అభిరుచి.. ఆసక్తులేంటో తెలుసుకోకుండా.. ఎక్కేజీకే లక్షలు కుమ్మరించి ప్రపంచ జ్ఞానాన్నంతా బోధిస్తే.. వచ్చే ప్రతిఫలం శూన్యమే. ఎందుకంటే మనోవిజ్ఞాన శాస్త్రంలోని అంశాలను విద్యకు, మేధాశక్తికి అన్వయించి.. విద్యార్థిలో వికాసం, చలన కౌశలాలను గుర్తించి బోధించే అవకాశం ఉపాధ్యాయుడికి మాత్రమే ఉంటుంది. గలగల మాట్లాడే విద్యార్థిని లైబ్రరీకి పరిమితం చేసినట్లు.. నోరే విప్పని విద్యార్థిని తరగతి నాయకుడిని చేసినట్లు.. ఎవరికి ఏ విషయంలో సత్తా ఉందో గ్రహించక బలవంతంగా నేర్పించే విద్య నిష్ఫలమే.. అందుకే గురువు లేని విద్య.. రాణించదంటారు పెద్దలు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యారంగంలో కంప్యూటర్లు, ఏఐల వినియోగాన్ని ఎవరూ తప్పు పట్టరు. కానీ అవన్నీ ఉపాధ్యాయుడికి సహాయకారిగా ఉండాలే కానీ.. అవే గురువు స్థానాన్ని భర్తీ చేసేలా ఉండకూడదు.

ఇక ఉపాధ్యాయులు సైతం ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతిక అంశాల్లో తర్ఫీదు పొంది.. బోధనలో సరికొత్త ప్రక్రియలు అనుసరించినప్పుడే పాఠ్యాంశ బోధన భారం కాకుండా ఉంటుంది. అదే సమయంలో విద్యార్థులకు, సమాజానికి కీడుచేసే విపరీత పోకడలను, దుష్ప్రవర్తనను యుక్తితో విడనాడి.. విచక్షణతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా ఎంతో ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తిలో చిన్నపాటి మరకలా కనిపించే తప్పుడు పనులకూ ఆస్కారం ఇవ్వకుండా ముందుకుసాగే అవకాశం ఉంటుంది. ఇక ఏదేమైనా.. ఎవ్వరేమనుకున్నా.. మానవుడి జీవితానికి ఆదిగురువు కుటుంబం అయినా.. బతుకు నేర్పే విద్యను బోధించేది మాత్రం ఉపాధ్యాయుడే. అందుకే యుగాలు.. తరాలతో సంబంధం లేకుండా గ్రామానికి ఆత్మబంధువుగా.. విద్యార్థి తల్లిదండ్రులకు శ్రేయోభిలాషిగా.. తన శిష్యులకు రోల్‌మోడల్‌గా.. ఉపాధ్యాయులు ప్రపంచవ్యాప్తంగా కీర్తించబడుతూనే ఉన్నారు.. ఉంటారు కూడా.

అందుకే.. ఈ లోకంలో ప్రతిఒక్కరూ చెప్పే మాట. మాస్టారు.. మీరే మా.. "స్టారు"...!

**- బాలుబాబు**

# శ్రీధర్‌రెడ్డిని చంపించాలనుకుంది ఎవరు?

(మొదటిపేజీ తరువాయి)

వివరణ ఇవ్వడం, పోలీసు కస్టడీలో అరుణ అనేక ఆసక్తికర విషయాలు వెల్లడించడం, ఇదే తరుణంలో శ్రీధర్‌రెడ్డి హత్య పథకంపై ఓ కిరాయి ముఠా జరిపిన సంభాషణ బయటకి రావడంతో ఇవన్నీ జిల్లాలో పెనుసంచలనాలుగా మారాయి.

సూళ్లూరుపేట నుండి కావలి దాకా శ్రీకాంత్ అండతో అరుణ కనుసైగల్లో జరిగిన అనేక అరాచక వ్యవహారాలు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అరుణ వాడుతున్న నాలుగు సెల్ ఫోన్లలో రెండు ఫోన్లలోని సమాచారమే ఇప్పటివరకు బయటకి లాగినట్లు తెలుస్తోంది. మిగతా రెండు ఫోన్లలోని విషయాలని కూడా బయటకి తీస్తే చాలామంది రాజకీయ నాయకుల భాగోతాలు బయటపడతాయేమోనన్న అనుమానాలు పోలీసు శాఖ వ్యక్తం చేస్తోంది. అయితే ఒకప్పుడు వైసీపీలో వున్న తరుణంలో అరుణతో సన్నిహితంగా మెదిలిన నాయకులు కొంతమంది ఇప్పుడు టీడీపీలో ఉండడంతో పూర్తిస్థాయి నిజాలు బయటకివచ్చే అవకాశం లేదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### శ్రీధరరెడ్డి కథలోకి వెళ్తే....

పోలీసులు వెల్లడించిన వీడియో సమాచారం ప్రకారం నగరంలోని మద్రాసు బస్టాండు సమీపంలోని ఓ లాడ్జిలో జులై 1వ తేదీన వినీత్, మహేష్, జగదీష్ అనే వారితో పాటు మరికొంత మంది రౌడీషీటర్లు సమావేశమయ్యారు. ఆ సమయంలో వాళ్ళు పుల్లుగా మందు కొట్టి మాట్లాడుకున్న మాటలు వారిలో ఒకరు రికార్డు చేశారు. "డబ్బు పెద్ద సమస్యా...? అని ఓ వ్యక్తి అంటుంటే" కోటంరెడ్డిని లేపేస్తే డబ్బే డబ్బు" అని మరోవ్యక్తి అనడం.. "చంపేస్తాంరా" అని మొదటి వ్యక్తి మళ్ళీ అనడం ఆ వీడియో సారాంశం.

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని చంపేస్తే కావలసినంత డబ్బు వస్తుందన్నది ఆ సంభాషణలో స్పష్టంగా అర్ధమవుతోంది. ఇదే అంశం మీద శ్రీధర్‌రెడ్డి మీడియా సమావేశం పెట్టారు. తనని చంపితే డబ్బు లిస్తానన్నది ఎవరో తేల్చాలని పోలీసులని కోరారు. తనకంటే ముందే ఆ వీడియో పోలీసుల దృష్టికి వచ్చినా తనని ఎందుకు అప్రమత్తం చేయలేదని ప్రశ్నించారు. తన ప్రాణ రక్షణ కోసం తనజాగ్రత్తలు తాను తీసుకుంటున్నానని చెప్పారు. ఇలాంటి ఆకురౌడీలకి, తాటాకు చప్పుళ్ళకి తాను బెదిరే ప్రసక్తే లేదన్నారు. తాను వీ.ఆర్ కాలేజీలో విద్యార్థి నాయకుడిగా వున్న రోజుల్లోనే ఇలాంటివి చాలా చూశానన్నారు.

### వరుస సంఘటనలు...

### వంద ప్రశ్నలు?

నరహంతకుడు శ్రీకాంత్ పెరోల్‌పై బయటకి ఎందుకు రావాలనుకున్నాడు...? నిజంగా అరుణతో పెళ్ళి కోసమేనా... ఇంకేదైనా కారణం ఉందా...? తన పెరోల్ సిఫారసు లేఖల కోసం గూడూరు ఎం.ఎల్.ఏ పాశం సునీల్‌తో పాటు శ్రీధర్‌రెడ్డినే ఎందుకు ఎంపిక చేసుకున్నాడు...? శ్రీధర్‌రెడ్డి హత్య గురించి మాట్లాడుకున్న గ్యాంగ్‌కి శ్రీకాంత్‌తో ఎలాంటి సంబంధాలు వున్నాయి...? ఒకవేళ వుంటే ఈ మర్డర్ ప్లాన్ శ్రీకాంత్, అరుణలకి ముందే తెలుసా...? శ్రీధర్‌రెడ్డిని లేపేస్తే డబ్బే డబ్బు అని ఎందుకన్నారు..? అంటే శ్రీధర్‌రెడ్డి హత్యకి ఎవరైనా సుపారీ ఇచ్చారా...? అలా ఇచ్చి ఉంటే ఆ అజ్ఞాత వ్యక్తి ఎవరు...? శ్రీధర్‌రెడ్డిని చంపేసినందువల్ల రాజకీయంగా లాభపడేది ఎవరు...? శ్రీధర్‌రెడ్డి కంటే ముందే ఆ వీడియో పోలీసులకి చిక్కిందా..? అలా చిక్కి ఉంటే పోలీసులు దానిని ఎందుకు బయటపెట్టలేదు...? శ్రీధర్‌రెడ్డిని జాగ్రత్తపడమని ఎందుకు చెప్పలేదు...? ఈ మొత్తం ఉదంతంలో అరుణ, శ్రీకాంత్ పాత్రలు ఏమిటి...? తెలుగుదేశం ముఖ్య నాయకులతో (శ్రీధర్‌రెడ్డితో సహా) అతి సన్నిహితంగా మెదిలిన వినీత్‌యాదవ్ శ్రీధర్‌రెడ్డి హత్య కుట్రలో ఎందుకు పాలు పంచుకున్నాడు...? అంత బహిరంగంగా శ్రీధర్‌రెడ్డి హత్య గురించి మాట్లాడుకుంటూ వీడియో ఎందుకు తీశారు...? వీడియోని లీక్ చేసి బెదిరించాలనుకున్నారా...? లేక వాళ్ళలో వాళ్ళకే అభిప్రాయ భేదాలు వచ్చాయా...? సరిగ్గా ఈ సమయంలోనే వీడియో బయటకి ఎలా వచ్చింది...? ఎవరు లీక్ చేశారు..? ఇలాంటి అనేక అనుమానాలని ఛేదించాల్సిన బాధ్యత పోలీసులపై వుంది.

శ్రీకాంత్ విశాఖ జైల్లో ఉన్నాడు. అరుణ ఒంగోలు జైల్లో ఉంది. హౌటల్ ముఠా సభ్యులు ఆరు మంది నెల్లూరు జైల్లో ఉన్నారు. వీళ్లందరి దగ్గర నుండే పోలీసులు పై ప్రశ్నలన్నిటికీ సమాధానాలు రాబట్టాలి.

శ్రీకాంత్ పెరోల్, అరుణ ఆగడాలు, శ్రీధర్‌రెడ్డి హత్యకి కుట్ర, వంటి వరుస సంఘటనలతో నెల్లూరు ఉలిక్కిపడింది. ఎప్పుడూ లేనివిధంగా నెల్లూరులో ఇలాంటి హత్యా రాజకీయాలు, అరాచక పర్వాలు ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాజకీయ నాయకులు వాళ్ళ స్వార్థం కోసం ఇలాంటి సంఘ విద్రోహశక్తులను పెంచి పోషించడం మంచి సంప్రదాయం కాదని అభిప్రాయపడుతున్నారు. నయాతరం రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం జిల్లా పరువుని తాకట్టు పెడుతున్నారని మాట్లాడుకుంటున్నారు. ఇలాంటి దుర్మార్గపు శక్తులని ప్రభుత్వ పెద్దలు ఉక్కుపాదంతో అణిచివేయాలని కోరుకుంటున్నారు.



## వెంకటగిరి పోలేరమ్మ జాతర కోసం..

# 40 లక్షలు విడుదల చేసిన మంత్రి ఆనం

జిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన వెంకటగిరి గ్రామశక్తి.. శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతరను రాష్ట్రపండుగగా ఈ నెల 7 నుండి 11వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని 40 లక్షల రూపాయలను మంజూరు చేశారు. ఈనెల 2న దేవస్థానానికి ఆ నిధులు విడుదల చేసి మంత్రి ఆనం వెంకటగిరిపై, ప్రత్యేకించి పోలేరమ్మ అమ్మవారిపై తనకున్న శ్రద్ధాభక్తులను చాటుకున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ ఏడాది పోలేరమ్మ జాతర అంగరంగవైభవంగా జరిగేందుకు ఈ నిధులు మంజూరు చేయడంతో వెంకటగిరి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ● బదిలీలు... నియామకాలు

### పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా.. డాక్టర్ మాధవి

నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాసుపత్రి (పెద్దాసుపత్రి) రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కొండేటి మాధవి నియమితులయ్యారు. ఈ స్థానంలో పనిచేసిన సిద్ధానాయక్ జూన్‌లో ఉద్యోగ విరమణ చేయడంతో, ప్రభుత్వ వైద్యకళాశాలలో బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మాధవికి ఉద్యోగోన్నతి కల్పించి ఇక్కడ నియమించారు. ఈనెల 2న ప్రభుత్వం ఆమేరకు ఉత్తర్వులిచ్చింది.

### ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇగా..విజయభాస్కర్

జిల్లా గ్రామీణ నీటిసరఫరా విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఇ)గా పులివెందులలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్న విజయభాస్కర్‌ను నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

### ఇన్‌ఛార్జి డీఆర్ఓగా..విజయకుమార్

జిల్లా రెవిన్యూ అధికారిగా ఉన్న హుస్సేన్‌సాహెబ్ ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో, ఆ స్థానంలో పౌరసరఫరాలశాఖ అధికారి విజయకుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఆనంద్ ఈనెల 1న ఆదేశాలిచ్చారు.

### తెలుగుగంగ ఇన్‌ఛార్జి స్పెషల్ కలెక్టర్‌గా..ఆసిఫా

తెలుగుగంగ ఇన్‌ఛార్జి స్పెషల్ కలెక్టర్‌గా ఆసిఫాను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఈనెల 1న ఉత్తర్వులిచ్చారు. అటవీశాఖ సెటిల్‌మెంట్ అధికారిణిగా ఉన్న ఆమె త్వరలోనే ఆ కొత్తబాధ్యతలు స్వీకరిస్తారు.

### గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జిగా..శ్రీనివాసులు

జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారిగా ఏపీ ఐఎంపీ పీడీగా ఉన్న బి. శ్రీనివాసులును నియమించారు. ఈ స్థానంలో పనిచేస్తున్న పీబీకే పరిమళ ఆ శాఖ డిప్యూటి డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై పాడేరుకు బదిలీ అయ్యారు.

## ముగ్గురు ఉపాధ్యాయులకు..

# రాష్ట్రస్థాయి అవార్డులు



చెన్నయ్య



డోనమిక్ రెడ్డి



ఎస్‌కె ముజీర్

ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నెల్లూరుజిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న సిహెచ్ చెన్నయ్య, ఇందుకూరుపేటలోని ఎంకెఆర్ ప్రభుత్వ హైస్కూల్ అధ్యాపకుడు కె.డోనమిక్‌రెడ్డి, ఇందుకూరుపేట మండలం నరసాపురం ఎంవీఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌కె ముజీర్‌లు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. ఈనెల 5న అమరావతిలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో వీరు ఆ అవార్డులను అందుకోనున్నారు. ఈ ముగ్గురూ కోవూరు నియోజకవర్గంలోనే పనిచేస్తుండడం విశేషం!

## ఎమ్మెల్యే కాకర్ల చొరవతో..

# ఉదయగిరి వైద్యశాలకి 5.75 కోట్లు

ఎట్టకేలకు ఎంతోకాలంగా నిరీక్షిస్తున్న ఉదయగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంచిరోజులొచ్చాయి. పాతభవనాలతో, అసౌకర్యాల నిలయంగా ఉన్న ఆ వైద్యశాలకి ఎమ్మెల్యే కాకర్ల చొరవతో మహర్దశ పట్టిందనే చెప్పవచ్చు. ఈ వైద్యశాలలో వసతులు లేని దుస్థితిని కాకర్ల ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడంతో, తాజాగా ఈనెల1న ఆ ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి 5.75 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఆ నిధులతో ప్రస్తుతం ఉన్న పాత భవనాలను తొలగించి కొత్తవి నిర్మించనున్నారు. మౌలిక సదుపాయాలకు లోటులేకుండా చర్యలు తీసుకోబోతు న్నారు. అక్కడే ప్రత్యేకంగా ప్రసూతికేంద్రాన్ని కూడా నిర్మించడానికి సమాయత్తమవుతున్నారు.




# రక్షణ, ఏరోస్పేస్ హబ్‌గా..ఆంధ్రప్రదేశ్

రక్షణ, ఏరోస్పేస్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ రూపుదిద్దుకోబోతోంది. ఆగస్టు 29న విశాఖపట్నంలో భారత పరిశ్రమల సమాఖ్య 2వ అంతర్జాతీయ సమావేశంలో ఏరోస్పేస్ తయారీకి సంబంధించిన అంశాలు, మరియు ప్రదర్శన నిర్వహించారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ మరియు సీఐఓ సంయుక్త సమావేశంలో భారత సివిల్ ఏవియేషన్ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీ మరియు హెచ్ఆర్ మంత్రి నారా లోకేష్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు మరియు డీఆర్‌డీఓ మాజీ కార్యదర్శి డాక్టర్ జి.సతీష్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏరోస్పేస్ తయారీ రంగంలో ఉన్న సానుకూలాంశాలపై వారు చర్చించారు. రక్షణ మరియు ఏరోస్పేస్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల పురోగతికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, ప్రణాళికలను డాక్టర్ జి.సతీష్‌రెడ్డి వివరించారు. డిఫెన్స్ మరియు ఏరోస్పేస్ రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని కూడా ఆయన తెలిపారు.

# శ్రీసిటీలో అలరించిన.. వీణ కచేరీ



శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఇటీవల భక్తిరసభరిత వీణా వాద్య కచేరి భక్తులను ఎంతగానో అలరించింది. శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆహ్లాదకరమైన ప్రకృతి వాతావరణంలో యువ కళాకారిణి శ్రీమతి వాకచర్ల సుష్మా తమ వీణా వాదనతో అందరినీ భక్తిభావ సమన్వితులను చేశారు. పాలేటి హేమలక్ష్మి వద్ద సంగీతంలో శిక్షణ పొందిన సుష్మ తరువాత డిఎస్ ఝాన్సీ మార్గదర్శకత్వంలో సూళ్లూరుపేటలోని ఎంజిఆర్ సంగీత పాఠశాలలో సంగీత సాధన కొనసాగించారు. తొలుత త్యాగరాజ కీర్తన "శ్రీ గణనాథం భజామ్యహం" (కనకాంగి రాగం)తో కచేరీ ప్రారంభించిన ఆమె, తరువాత అన్నమాచార్య కీర్తనలను హృద్యంగా ఆలపించారు. అనంతరం, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆమెను అభినందించారు. అమెరికా డెట్రాయిట్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త భరత్‌రెడ్డి సుష్మను అభినందిస్తూ జ్ఞాపికను బహుకరించి సత్కరించారు. శ్రీసిటీ పిఆర్ఓ బాలాజీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీసిటీ పరిసర గ్రామాల నుంచి కూడా భక్తులు హాజరై, సంగీతానుభూతితో పాటు స్వామివారి కృపకు పాత్రులైనారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదం, అన్నప్రసాదం పంపిణీ చేశారు.



లాయర్
సెప్టెంబర్ 05, 2025

# ఎరువు.. రైతన్నకు గుండె బరువు!

ఇప్పుడు ఆంధ్రరాష్ట్రమంతటా రైతన్నలకు పెద్ద సమస్యగా తయారైంది ఎరువుల పంపిణీ. అసలే గిట్టుబాటు ధరలు లేక పండిన పంటలను తక్కువ ధరకే తెగనమ్ముకునే దుస్థితిలో ఉన్న రైతులు, ప్రతి వ్యవసాయ సీజన్‌లోనూ నానా రకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రతి దశలోనూ రైతును దగా చేసే దళారులు, వ్యాపారులు గుంటనక్కల్లా పొంచి ఉండి రైతు కష్టాన్ని దోచుకుంటూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు ఎందరు వచ్చినా రైతు బతుకుల్లో ఎలాంటి మార్పులు ఉండడం లేదు. ఈ నేపథ్యంలో పంటలకు అవసరమైన యూరియా, లేదా డీఏపీ ఎరువులు కూడా రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయి. వ్యాపారులు కూడబలుక్కుని ఎరువులను బ్లాక్‌మార్కెట్‌లో ఎక్కువ ధరలకు అమ్మేసుకుంటున్నారు. కృత్రిమ కొరతను సృష్టించడం వారి వ్యాపారంలో ఒక కిటుకు. కాసుల కోసం కక్కుర్తిపడి ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విషయాల్లో రైతును నిలువునా ముంచేస్తున్నారు. ప్రభుత్వాలు ఎంత కఠినంగా ఉన్నా, వ్యాపారులు చాకచక్యంగా తమ పని చక్కబెట్టుకుంటున్నారు. రైతులెంతగా బాధపడుతున్నా కొందరు అవినీతి అధికారులు కమిషన్ల కోసం ఈ అన్యాయాలన్నిటినీ చూసీ చూడనట్లుంటున్నారు. 266 రూపాయలకు ఇవ్వాల్సిన యూరియాను మార్కెట్లో రూ.350 చెప్తున్నారు. 1350కి రావాల్సిన డీఏపీ ఎరువు బస్తా ధర 1500 పలుకుతోంది. అయినా, సంబంధిత అధికారులు నామమాత్రపు తనిఖీలతోనే సరిపెట్టుకుంటుంటారు. అందుకే ఈ సమస్య ఏనాటికీ తీరనిదిగానే ఉంటోంది. నేటికీ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రత్యేకించి ఈ ఎరువుల మాయాజాలం రైతన్నలను కుంగదీస్తోంది. అప్పోసప్పో చేసి, స్వేదంతో సేద్యం చేసుకునే సాదాసీదా, మధ్యతరగతి రైతన్నలకి ఎరువులు గుండె బరువులుగా తయారయ్యాయంటే అతిశయోక్తేమీ లేదు. అయితే, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక, ఎరువులు, పురుగుమందుల విషయంలో రైతులకు ఎలాంటి కొరత లేకుండా చూడాలని, ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి అక్రమనిల్వలపై చర్యలు తీసుకోవాలని ఇటీవల స్పష్టమైన ఆదేశాలివ్వడం హర్షదాయకం. దీంతో విజిలెన్స్, వ్యవసాయశాఖల ఉన్నతాధికారులు ఒక్కసారిగా రంగంలోకి దిగారు. గత ఆగస్టు నెలలో కేవలం 9రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 598 ఎరువుల దుకాణాల్లో 286 విజిలెన్స్ బృందాలు ఆకస్మిక దాడులు చేశాయి. అక్రమంగా అమ్ముకుంటున్న కోటీ 83 లక్షల రూపాయల విలువైన సుమారు 934 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వల్ని అధికారులు సీజ్ చేశారంటే, ఈ ఎరువుల అక్రమ వ్యాపారం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఈ అక్రమాలకు సంబంధించి 124 కేసులు నమోదు చేయడం, మరో 8 మంది దుకాణాల యజమానులపై క్రిమినల్ కేసులను కూడా పెట్టడం బహుశా రాష్ట్రంలో ఇదో రికార్డు కావచ్చు. 4.29 కోట్ల విలువైన 1910 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపేయడమే కాక, నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాదారులపై నిత్యావసర సరుకుల చట్టంలోని 6-ఏ సెక్షన్ కింద అధికారులు కేసులు నమోదు చేశారు. మొత్తంగా ఆగస్టు నెలలో ఒక్క 9రోజుల్లోనే 2845 టన్నుల ఎరువుల్ని స్వాధీనం చేసుకుని, 199కేసులు పెట్టారంటే ఎరువుల వ్యాపారులు ఇంతకాలంగా రైతులను ఎంతగా దగా చేస్తున్నారో తేటతెల్లమవుతుంది. ఇంత పెద్దఎత్తున ఒకేసారి తనిఖీలు జరగడం రాష్ట్రంలో ఇదే తొలిసారి కావచ్చు కూడా. ఒక్క ఎరువుల్లోనే కాదు, పురుగుమందులు, నకిలీ విత్తనాలు, మద్దతు ధర లేకుండా మోసం చేయడాలు ఒకటా రెండా ప్రతిచోటా రైతుల్ని వ్యాపారులు, దళారులు జలగల్లా పట్టిపీల్చి పిప్పిచేస్తున్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతు వెన్నెముకనే విరిచేస్తున్నారు. ఇలాంటి అక్రమార్కులపై ప్రభుత్వాలు కొరడా ఝుళిపించాలి. రైతులు వారి బారినపడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన విధానాలు అవలంభించి, వాటి విక్రయాలను శాశ్వత ప్రాతిపదికపై క్రమబద్ధం చేయాలి. దేశానికి అన్నం పెట్టే రైతన్నను నిలువు దోపిడీ చేస్తున్న అక్రమార్కులపై మరింత కఠినచర్యలు తీసుకోవాలి. అవసరమైతే ఆమేరకు చట్టాలను సవరించైనా సరే, కఠినశిక్షలు విధించి ఈ అక్రమాలను నిలువరించాలి. వీలైతే ప్రభుత్వమే నేరుగా ఎరువులను, పురుగుమందులను, నాణ్యమైన విత్తనాలను రైతులకు ఇబ్బందిలేని ధరలకు అందించే ఏర్పాట్లు చేయాలి. రైతులకు ఎరువులు తదితర సమస్యలు గుదిబండలు కాకుండా చూసినప్పుడే రైతుల కళ్ళల్లో ఆనందం తొణికిసలాడుతుంది. రైతు క్షేమంగా ఉన్నప్పుడే దేశం కూడా సుభిక్షంగా ఉంటుంది.

## మంత్రి నారాయణ సారుకి ధన్యవాదాలు!

గతంలో 2014 –19 మధ్యకాలంలో నారాయణ సారు మంత్రిగా ఉన్న తరుణంలో నగరంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే, 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడగానే ఆ పార్టీ నాయకులు నారాయణ సారు చేపట్టిన పనులన్నీ ఎక్కడికక్కడే వదిలేశారు. ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు మేమెందుకు పూర్తి చేయాలన్న కుళ్ళు రాజకీయాలతో కొన్ని పనులు పూర్తయినా ప్రారంభోత్సవాలు చేయలేదు. మరికొన్నిటిని సగంలోనే ఆపేసారు. ఇప్పుడు అయిదేళ్ల తరువాత మళ్ళీ నారాయణ సారు గతంలో మంత్రిగా ఆయన మొదలుపెట్టి సగంలో ఆగిపోయిన పనులన్నిటినీ పూర్తి చేస్తున్నారు. అప్పట్లో పూర్తైన వాటికి ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. మినీబైపాస్‌లోని అన్నమయ్య కూడలిలో అయిదేళ్ళుగా పనులు పూర్తై పాడుబడిపోయిన ఎన్టీఆర్ పార్కు ప్రారంభమై నిత్యం రద్దీతో కళకళలాడుతోంది. ఇదే విధంగా నగరంలో అనేక పార్కులకి పూర్వవైభవం వచ్చింది. నెల్లూరు వి.ఆర్. హైస్కూలు అధునాతన వసతులతో పునః ప్రారంభమయ్యింది. అనేక మునిసిపల్ బడులు కూడా కొత్త అందాలని దిద్దుకుంటున్నాయి. బాలాజీనగర్‌తో మినీబైపాస్‌ని కలిపే వంతెనలు ప్రారంభమవుతున్నాయి. స్వామిదాసు స్కూల్ వద్ద ఐదేళ్ళ క్రితమే నిర్మితమై ప్రారంభోత్సవానికి నోచుకోని వంతెనని కూడా ఇటీవలే సారు ప్రారంభించారు. నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తూ, ప్రజల అవసరాలు గమనించి తీరుస్తున్న నారాయణ సారుకి ధన్యవాదాలు. – కే.వీ.కుమార్, బాలాజీనగర్.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## చెరువుల్ని తలపిస్తున్న ఇస్కాన్ బురదగుంటలు!

నగరంలోని ఇస్కాన్ సిటీలో కొన్ని ఖాళీ ప్లాట్లలో భారీగా బురద నీరు చేరి చెరువులని తలపిస్తున్నాయి. ఖాళీ ప్లాట్లని మట్టితో పూడ్చకుండా వదిలేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఈ బురద గుంటలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి లక్షల సంఖ్యలో దోమలు ఇస్కాన్ సిటీ మొత్తం వ్యాపించి వున్నాయి. గౌరవ రూరల్ శాసన సభ్యులు ఈ దుస్థితిపై దృష్టిపెట్టి ప్లాట్ యజమానులకి కార్పొరేషన్ అధికారుల ద్వారా నోటీసులు ఇప్పించవలసిందిగా మనవి. ఇస్కాన్ సిటీ నివాసితులని దోమలు, రోగాల బారినుండి రక్షించవలసిందిగా విజ్ఞప్తి. – కే.ఆనందరాజు, ఇస్కాన్ సిటీ.

## కలసి వుంటే.. కలదు సుఖం!

భారత ప్రధాని నరేంద్ర మోడీ తాజాగా చేసిన జపాన్ మరియు చైనా పర్యటన ప్రపంచానికి కొత్త సంకేతాలని ఇస్తుందనడంలో సందేహం లేదు. జపాన్ దేశస్తులు మన ప్రధానిని స్వాగతించిన తీరు నభూతో న భవిష్యతి. విమానం దిగినప్పటి నుండి రెడ్‌కార్పెట్ వెల్కమ్ చెప్పడంతో పాటు, భారతీయ కళలని జపాన్ పౌరుల చేత ప్రదర్శింప చేసి అబ్బురపరచారు. చైనాలో సైతం మన ప్రధానికి అఖండ స్వాగతం లభించింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఓవైపు, రష్యా అధ్యక్షుడు పుతిన్ మరోవైపు నిలబడి మధ్యలో మన మోడీ నిల్చున్న ఛాయాచిత్రం ఇప్పుడు నెట్టింట సందడిచేస్తోంది. అర్థరహిత సుంకాలతో ఇతర దేశాలతో కయ్యానికి కాలు దువ్వుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కి ఈ ముగ్గురి కలయిక ఒక హెచ్చరిక లాంటి సందేశం పంపినట్లుగా నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. భవిష్యత్తులో ఆర్థిక, వ్యాపార, పారిశ్రామిక రంగాలలో సంచలనాత్మక మార్పులకి ఈ కలయికని నాందిగా పేర్కొంటున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ సమర్ధతకి, ఆయనకి ఉన్న నాయకత్వ పటిమకి ఈ కలయిక ఒక ఉదాహరణ అని చెప్పక తప్పదు! – యం.చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

## సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 106

# సాగర తీరం.. సమస్యల హోరం!

కనుచూపు మేర కనిపించే సముద్రజలాలు, పెద్దపెద్ద అలలు, హోరున వీచే గాలి, నయన మనోహరమైన ప్రకృతి అందాలతో సాగర తీర పరిసరాలన్నీ అందంగా ఆహ్లాదకరంగా ఉంటాయి. అంతేకాదు, సముద్రస్నానాలు చేయడం మంచిదని శాస్త్రాలు కూడా చెప్తుండడంతో, ప్రజలు ఎక్కువగా సముద్రతీరాలకు వస్తుంటారు. సెలవులు వచ్చినా, తీరిక దొరికినా పిల్లాపాపలతో సహా సముద్ర తీరానికి వెళ్ళి సంతోషంగా గడుపుతుండడం అనాదిగా వున్న అలవాటు, ఆనవాయితీ కూడా. మనోళ్ళే కాదు, బ్రిటీషోళ్ళ కాలంలో విదేశాల నుంచి కూడా అధిక సంఖ్యలో పర్యాటకులు మనదేశానికి వచ్చేవారని, కృష్ణపట్నం వంటి సాగరతీరాల్లో నెలల తరబడి గుడారాలు వేసుకుని హాయిగా గడిపేవారని చరిత్ర చెప్తోంది. అలాంటి సాగరతీరాలు ఇప్పుడు ఎవరికీ పట్టని అనాథలుగా సమస్యల తోరణాలుగా మారిపోవడం విచారకరం. నేటి ఆధునిక కాలంలో గతంలో కంటే ఎక్కువగా పర్యాటకులు పెరుగుతూనే ఉన్నా, సముద్రతీరాల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం పర్యాటకంపై మన పాలకులకు, ప్రభుత్వాలకు ఉన్న నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమనే చెప్పవచ్చు.

### ఆహ్లాదానికి బదులు అనారోగ్యం మిగులుతోంది...

మనదేశానికి, ముఖ్యంగా మన రాష్ట్రానికి అద్భుతమైన సుదూర సాగరతీరం ఉండడం ప్రకృతి మనకు ప్రసాదించిన గొప్ప వరం. దేశంలో సుమారు 11వేల కిలోమీటర్లకు పైగానే సముద్రతీరం ఉంది. అందులో 1053 కిలోమీటర్ల వరకు మన ఆంధ్రరాష్ట్రంలో ఉండడం గమనార్హం. సముద్రం అంచునే ఉండే ఈ తీరాలను ఏళ్ళ తరబడిగా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నాయి. దీంతో సముద్ర తీరాలు సమస్యల నిలయాలుగా తయారయ్యాయి. ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణమే. తీరం పొడవునా రకరకాల వ్యర్థపదార్థాలతో గబ్బుకొట్టిపోతోంది. నిత్యం పర్యాటకులు వేల సంఖ్యలో బీచ్‌ల వద్దకు వస్తున్నా, వారి అతీగతీ పట్టించుకోకపోవడంతో, వాళ్లు తాగే నీళ్లసీసాలు, తిని పారేసే ఆహారపదార్థాలు, ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లు వగైరాలతో అనేక తీరప్రాంతాలు దుర్వాసనతో నిండిపోతున్నాయి. చూసేందుకు ఇది చాలా చిన్న విషయంగా అనిపించినా, ఇప్పుడు దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సముద్ర తీరాలకిది కొరుకుడు పడని జటిలసమస్యగానే తయారైంది. అలా నిత్యం కోట్లాది టన్నుల ప్లాస్టిక్, తదితర వ్యర్థాలన్నీ సముద్రాల్లో కలిసిపోతుండడం చివరికి ప్రకృతికి, పర్యావరణానికే పెద్ద విపత్తుగా తయారైంది. ప్రధాని మోడీ చొరవతో కేంద్రప్రభుత్వం కొంతకాలం క్రితం 'పునీత్ సాగర్ అభియాన్' కార్యక్రమాన్ని చేపట్టి, సాగరతీరాల్లో వ్యర్థాలను ఏరివేసేందుకు సంకల్పించింది. కానీ, ఆశించిన స్థాయిలో ముందడుగు పడలేదు. ఏవో కొన్ని సామాజిక సేవా సంస్థలు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత అంతా అప్పుడప్పుడూ సమీపంలోని సముద్రతీరాలకి వెళ్ళి చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్నారు కానీ, క్రమబద్ధమైన చర్యలు లేవు. చెత్తను నిర్ణీత స్థలాల్లో వేసేలా చూడడం, వాటిని నిత్యం ఎత్తివేయడం ముఖ్యం. అందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలి. పర్యాటకుల తాకిడి ఉన్న ప్రాంతాల్లో వీలైనన్ని చెత్తకుండీల ఏర్పాటు అవసరం. సముద్రపు హోరు గాలికి ఆ చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు సముద్రంలో కలసిపోకుండా ప్రత్యేకంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలి. దాంతో పాటు, పర్యాటకులు ఆ వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ వేయకుండా వారిలో అవగాహన కల్పించాలి. తీరప్రాంతాల్లో పరిశుభ్రత ఎంత ముఖ్యమో బోర్డుల ద్వారా, కరపత్రాల ద్వారా ప్రకటించి ప్రజల్లో పెద్దఎత్తున ప్రచారం చేయాలి. పోలీసు గస్తీ, పర్యవేక్షణ ఎంత ఎక్కువగా ఉంటే అంతగా ఈ కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తాయి కనుక, పోలీసు బృందాల పర్యవేక్షణ ఉండేలా చూడాలి. లేకుంటే 'చెప్పేది ఘనం.. చేసేది పూజ్యం' అన్నట్లుగా తయారై, చివరికి తీరప్రాంతాల్లో ఆహ్లాదం కనుమరుగైపోయి, నిత్యం అనారోగ్యకర వాతావరణమే దర్శనమిస్తుందనడంలో అనుమానం లేదు.

### "బకింగ్‌హామ్ కాలువ" బాగుచేసుకుంటే బోలెడంత లాభం

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్ళవుతున్నా సముద్రతీరాన్ని కానీ, సముద్ర తీరం పొడవునా ఉన్న ఉప్పుకాలువ (బకింగ్‌హామ్ కాలువ)ను కానీ సక్రమంగా ఉపయోగించుకోలేకపోతున్నాం. బ్రిటీషోళ్ళ పాలనలో ఈ కాలువకి ఎంతో ప్రాధాన్యత ఉండేది. అప్పట్లో వర్తకమంతా పడవల్లో ఈ కాలువ మీదనే సాగేది. ఈ జలమార్గం ద్వారానే తీరంలోని వేలాది గ్రామాలకు రాకపోకలు ఉండేవి. పోర్టుల అభివృద్ధికి కూడా ఈ జలరవాణా ఆసరాగా ఉండేది. రోడ్డు, రైలు మార్గాల కన్నా జలమార్గాల ద్వారా అనేకప్రాంతాలకు సులభంగా చేరవచ్చు కనుక, పడవలపై ప్రయాణాలు, సరుకుల రవాణా ఎంతో అనుకూలంగా ఉండేది. కాలక్రమేణా ఇప్పుడవన్నీ కనుమరుగైపోయాయి. పర్యాటక శాఖ కొన్ని ప్రధానమైన తీరప్రాంతాల్లో బీచ్‌లని కొంతమేరకు అభివృద్ధి చేస్తున్నా, ఇంకా అనేక తీరాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక్క బకింగ్‌హామ్ కాలువను అభివృద్ధి చేసుకోగలిగితే అటు పర్యాటకులకు, ఇటు వేలాది తీరప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. హోటళ్ళు, రెస్టారెంట్లు, క్రీడా సౌకర్యాలు వంటివి ఏర్పాటు చేయడం, తీరం వద్దకు నేరుగా వెళ్ళేందుకు మంచి రోడ్లు, వాహన సదుపాయం వంటి ఇతరత్రా వసతులన్నీ శాశ్వత ప్రాతిపదికన కల్పించడం వంటివి ఇప్పుడెంతో అవసరం. బకింగ్‌హామ్ కాలువపై వంతెనల ఏర్పాటు ద్వారా, తీరానికి ప్రజలకు మధ్య అనుబంధం పెరుగుతుంది. తద్వారా ప్రజల్లో పర్యాటకంపై, పరిశుభ్రతపై కూడా అవగాహన కలుగుతుంది. ఇవన్నీ ఒకదానికొకటి గొలుసుకట్టు బంధాలు. ఒక అడుగు ముందుకు పడితే ఈ అభివృద్ధి పనులన్నీ వాటంతట అవే జరుగుతాయి. లేకుంటే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉండిపోతాయి. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో, అంకిత భావంతో కృషిచేస్తే తీరాల తీరు మార్చడం పెద్ద పనేం కాదు..!..

- రాజశ్రీ



## ○ నెల్లూరులో నాలుగు రోజులు

# సందడి చేసిన వెంకయ్యనాయుడు!

***భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి, మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు నాలుగు రోజులపాటు నెల్లూరులో గడిపారు. ఆగస్టు 29వ తేదీ తెల్లవారుఝామున చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో వెంకయ్య హైదరాబాదు నుండి నెల్లూరు చేరుకున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ రేణిగుంట మీదుగా తిరిగి హైదరాబాదుకి వెళ్లిపోయారు.***

29వ తేదీ ఉదయం నెల్లూరు పురమందిరంలో 3 రోజుల పాటు జరిగిన తెలుగుభాషా ఉత్సవాలని ప్రారంభించి ప్రసంగించారు.


## మాటే.. మంత్రం - వెంకయ్యనాయుడు

ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ... "మాటలో మంత్రం ఉంది. మంత్రంలో మాట ఉంది. మాట వినకుండా, మాట అనకుండా మానవుడు ఒక్కరోజు గడప దాటలేడు. మాట పడకుండా జీవితం గడిపినవాడు ధన్యుడు." అని అన్నారు. మన మాటలకు మూలమైన తెలుగు భాష ఆధునీకరణతో పాటు, భవిష్యత్ తరాలకు మాతృభాష మాధుర్యాన్ని చేరువ చేసేందుకు సృజనాత్మక మార్గాలను అన్వేషించాలని తెలుగు భాషాభిమానులు, తెలుగు సాహితీవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రాచీన భాష విశిష్ట భాష, శ్రేష్ఠమైన భాష, సుందర తెలుగు అని చెప్పుకుంటే సరిపోదన్న వెంకయ్య భావితరాలకు భాషా మాధుర్యాన్ని అందించేందుకు ప్రతి తెలుగువాడు నడుం బిగించాలని అన్నారు.

మాతృభాషను ప్రేమించడం, సోదరభాషను గౌరవించడం, అవసరాన్ని బట్టి పరభాషను అభ్యసించడం అత్యంత ఆవశ్యకమన్న ఆయన, బాలలకు ఆటపాటలతో తెలుగును నేర్పించగల సృజనాత్మక మార్గాలను అన్వేషించాలని సూచించారు. బడిలో నేర్పించే తెలుగుతో పాటు... బతుకును నిలబెట్టే తెలుగును కూడా విద్యార్థులకు నేర్పించేందుకు తల్లిదండ్రులు, తెలుగు భాషాభిమానులు చొరవ తీసుకోవాలని కోరారు.

## "తెలుగు భాష - స్వర్ణభారత్ - తిక్కన" పురస్కారానికి 5 లక్షల మూలనిధి

మరుసటిరోజు ఆగస్టు 30వ తేదీ ఉదయం వెంకటాచలంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని వెంకయ్యనాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా తెలుగు భాషపై తనకున్న మమకారాన్ని ఆయన మరోసారి చాటుకున్నారు. "తెలుగు భాష–స్వర్ణభారత్– తిక్కన" పురస్కారానికి తన వ్యక్తిగత పెన్షన్ నుంచి 5 లక్షల రూపాయలు మూలనిధిని విరాళంగా ప్రకటించారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రతి ఏటా ఎంపిక చేసే తెలుగు భాషా సేవకులకు ఈ మూల నిధి నుంచి పురస్కారం అందజేయమని సూచించారు. ఇదే తరుణంలో ఆయన మాట్లాడుతూ... ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఉందని అన్నారు. భారత ప్రభుత్వం తలపెట్టిన ప్రణాళికల్లో ప్రాచీన భారతీయ భాషల పరిరక్షణ, పోషణ, అభ్యున్నతి, ప్రాచుర్యం అత్యంత ప్రాధాన్యత గల అంశాలుగా ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే వివిధ భాషల అధ్యయన కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. ఏ భాష అధ్యయన కేంద్రం అయినా ఆ భాష మాట్లాడే గడ్డపై ఉంటే న్యాయం జరుగుతుందని, అందుకే తిక్కన సోమయాజి నడయాడిన నేల మీద ఈ విశిష్ట కేంద్రం ఏర్పాటు చేయడం సరైనదని భావించి తనవంతు ప్రయత్నం చేసినట్లు చెప్పారు. తెలుగు భాషాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అద్దె లేకుండా తాత్కాలికంగానైనా సరే ఉచితంగా కార్యాలయాన్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చిన స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ, తమ కుమార్తె దీపావెంకట్‌కి అభినందనలు తెలిపారు.




తెలుగు భాషలో విస్తృతమైన పద సంపద ఉందని, దాన్ని కాపాడుకోవాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. "ఒక భాష ప్రాధాన్యత తగ్గితే దాని చుట్టూ ఉన్న వేలాది సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు కూడా క్రమంగా తెరమరుగవుతాయని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రాచీన తెలుగు ప్రతులను, గ్రంథాలను యుద్ధప్రాతిపదికన డిజిటలీకరించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

కార్యక్రమంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీనివాసరావు, దూరదర్శన్ పూర్వ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రేవూరి అనంత పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు. మాడభూషి సంపత్‌కుమార్ రచించిన 'కృష్ణదేవరాయల కీర్తి' వ్యాస సంకలనం పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆయన వెంకయ్యనాయుడికి అంకితమిచ్చారు.

## శిక్షణార్థులతో భేటీ!



30వ తేదీ సాయంత్రం స్వర్ణభారత్ ట్రస్ట్ 'సోమా' నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఎలక్ట్రికల్, సోలార్, ఏసీ, ఇండస్ట్రియల్ పెయింటింగ్, బైక్ – కార్ మెకానిజం విభాగాల్లో శిక్షణ పొందుతున్న దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన యువతతో వెంకయ్యనాయుడు భేటీ అయ్యారు. వారితో ముచ్చటించి వారి ఆలోచనలను తెలుసుకున్నారు. జీవితంపట్ల వారి దృక్పథం తనని విశేషంగా ఆకట్టుకుందని ఈ సందర్భంగా వెంకయ్య తన సంతృప్తిని వ్యక్తం చేశారు. మెరుగైన నైపుణ్యం, కొండంత ఆత్మవిశ్వాసం, చక్కని ఆరోగ్యం కలిగిన యువతరం భవిష్యత్ భారతాన్ని నిర్మించగలరన్న తన ఆకాంక్షను ప్రతిబింబించే విధంగా ఉన్న ఇలాంటి యువతను చూస్తుంటే తనకి ఎంతో ఆనందం కలుగుతుందన్నారు. వారికి నైపుణ్యాభివృద్ధిని అందిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వహణ బృందానికి అభినందనలు తెలిపారు.

## వినాయకుల సందర్శన!

అదేరోజు 30వతేదీ సాయంత్రం నెల్లూరు నగరంలో శివాజీ సెంటర్, బీజీఆర్ సర్కిల్ తదితర ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలని వెంకయ్యనాయుడు తమ కుటుంబ సభ్యులతో సందర్శించారు.

## గణేశ్ నిమజ్జనం మరియు జలహారతి కార్యక్రమాలకి ముఖ్యఅతిథిగా ...



ఆగస్టు 31వ తేదీ నగరంలోని గణేశ్ ఘాట్ వద్ద జరిగిన ఆధ్యాత్మిక సంబరాలలో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణలింగేశ్వర ఆలయంలో కుటుంబ సభ్యులతో కలసి పూజలు చేశారు. అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన 10అడుగుల గణేశ్ విగ్రహ చిహ్నాన్ని వెంకయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన గణేశ్ నిమజ్జనం, జలహారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య సతీమణి ఉషమ్మ, కుమార్తె దీప, మనుమడు విష్ణు, మనుమరాలు సాత్వికతో పాటు సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, 'శుభమస్తు' సారథి బయ్యా వాసు, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శీనయ్య, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## మంత్రి నారాయణ కృషితోనే..

# విఆర్ హైస్కూలుకు పూర్వ వైభవం

## • ప్రశంసించిన డా.సతీష్‌రెడ్డి

నెల్లూరులోని విఆర్ హైస్కూలు పేదవిద్యార్థులకు వరమని, మంత్రి నారాయణ ప్రత్యేక కృషితోనే విఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం వచ్చిందని డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్‌లతో కలిసి విఆర్ హైస్కూలును సందర్శించారు. ఈ స్కూల్‌ను మంత్రి నారాయణ ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. కార్పొరేట్ వసతులతో పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను బోధించడం గొప్ప విషయమన్నారు. ఇక్కడ చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులను మంత్రి నారాయణ దత్తత తీసుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. మంత్రి నారాయణ విజన్ ఉన్న నాయకుడని, ఆ స్ఫూర్తితో దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చిన్నారులను దత్తత తీసుకోవాలని ఆయన కోరారు. ఈ స్కూలు అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిఇఓ బాలాజీరావు, బీజేపీ సీనియర్ నాయకులు పి.సురేంద్రరెడ్డి, విఆర్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## పొదలకూరు జడ్పీ స్కూల్‌ను..

# తనిఖీ చేసిన జడ్పీ ఛైర్‌పర్సన్



పొదలకూరులోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను ఇటీవల జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటీవల ఆ పాఠశాల స్థలం ఆక్రమణలకు గురవుతోందని పలుసార్లు ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు ఫిర్యాదు చేయడం, ప్రజా విజ్ఞప్తుల రోజున కూడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌కి ఆ విషయమై ఫిర్యాదు చేయడం జరిగిందని, ఈ నేపథ్యంలో జడ్పీ సీఇఓ జె.మోహన్‌రావుతో కలిసి పాఠశాలను తనిఖీ చేశామని తెలిపారు. ఈ విషయంలో పాఠశాల స్థలాన్ని సర్వేచేసి వెంటనే నివేదికను సమర్పించవలసినదిగా మండల తహశీల్దారుకు, నెల్లూరులోని సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంటు డైరెక్టరుకు ఆమె సూచించారు. ఆ నివేదిక ఆధారంగా ఇతర రికార్డులను కూడా పరిశీలించి సమస్యను త్వరితగతిని పరిష్కరించాలని ఆమె జడ్పీ సీఇఓను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని, నీటి సరఫరా సక్రమంగా ఉండాలని ఆమె సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ స్కూలులో పదవ తరగతి చదువుతున్న 149 మంది విద్యార్థులు రాబోయే టెన్త్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా అందరూ కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

# శ్రీ సాయి సచ్చరిత్ర.. శోభాయాత్ర



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న శ్రీ సాయి బాబా అద్దాల మందిరంలో ఆగస్టు 31న శ్రీ సాయి సచ్చరిత్ర శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. మందిరం ఛైర్మెన్ మధుసాయి సారథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. శ్రీసాయి మాల ధారణ మండల దీక్ష–శిరిడీ యాత్ర సందర్భంగా సాయిదర్బార్ నుండి నెల్లూరు నగర పురవీధులలో సుమారు 300 మంది సాయి భక్తులు శ్రీసాయి సచ్చరిత్రాన్ని తలపై పెట్టుకుని సాయినామ సంకీర్తనలతో, తప్పెట్లు తాళాలతో అత్యంత వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. సాయిదర్బార్ నుండి పద్మావతినగర్, బాలాజీనగర్, విజయమహల్ గేటు, గాంధీబొమ్మ కూడలి, ఆత్మకూరు బస్టాండ్, ఏసీ నగర్, ద్వారకామాయినగర్ మీదుగా శోభాయాత్ర తిరిగి మందిరానికి చేరుకుంది. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. పాబోలు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఉత్సాహంగా..పవన్ పుట్టినరోజు వేడుకలు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆధ్వర్యంలో, రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ తదితరులు నెల్లూరులోని విపిఆర్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేకు కట్ చేసి పవన్‌కల్యాణ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అటు పార్టీని పటిష్టం చేస్తూనే, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని అజయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన కార్యాలయంలో...

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఈ నెల 2న నెల్లూరులోని జనసేన కార్యాలయంలో ఉత్సాహంగా జరిగాయి. టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్, టీడీపీ రాష్ట్ర నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జనసేన నేత గనుకుల కిషోర్, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు కేకు కట్‌చేసి అందరికీ పంచారు. ఈనెల 2న స్థానిక గోమతినగర్‌లోని జనసేన కార్యాలయంలో ఆ సంబరాలు జరిగాయి. ముఖ్యఅతిథులు, నాయకులు అందరూ ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన రక్తదాన శిబిరంలో వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని రక్తదాతలను అభినందించారు. నేటి యువతకు పవన్ కళ్యాణ్ దిక్సూచిగా నిలుస్తారని, సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ సేవలందిస్తూ పవన్‌కల్యాణ్ అందరి మన్ననలు పొందుతుండడం హర్షదాయకమని నాయకులు కొనియాడారు.

# పేద విద్యార్థులకి వాకర్స్ నిత్యావసరాలు



నెల్లూరు నగరంలోని వియాని హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న పేద విద్యార్థులకు స్థానిక వివేకానంద వాకర్స్ అసోసియేషన్ వారు ఈనెల 2న నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేంద్రరెడ్డి, మాట్లాడుతూ, వాకర్స్ సంఘం ఉపాధ్యక్షులు స్వర్ణ రమేష్ తల్లి జయలక్ష్మి వర్ధంతిని పురస్కరించుకుని ఈ వితరణ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు టూత్‌పేస్టులు, సబ్బులు, బ్రష్‌లు, కొబ్బరినూనె వగైరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ పద్మజ, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మేకల నరేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నం రవిచంద్ర, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్ర షెట్టి, 203 డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యానాయుడు, సుబ్బరామిరెడ్డి, ప్రసాద్, మాజీ అధ్యక్షులు శేషగిరిరావు, పాల్గొన్నారు






# నెల్లూరు కబుర్లు

## 20న.. రామలింగాపురం
# అండర్ బ్రిడ్జికి ప్రారంభోత్సవం



నెల్లూరురూరల్ నియోజకవర్గం పరిధిలోని 19వ డివిజన్ రామలింగాపురం అండర్ బ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 20న ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. సుమారు 60లక్షల రూపాయల వ్యయంతో ఇక్కడ జరుగుతున్న సి.సి.రోడ్డు నిర్మాణ పనులను ఆర్అండ్‌బి, మున్సిపల్ కార్పొరేషన్ మరియు ట్రాఫిక్ పోలీస్ అధికారులతో కలసి ఇటీవల టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ వంతెన విషయమై సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, అనుకున్న సమయానికి నాణ్యతా ప్రమాణాలతో సి.సి. రోడ్డు ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నూకరాజు మదన్ కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు గోపాలయ్య, కోరెం ప్రవీణ్, రమేష్, కాయల మధు, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలి



నేత్రదానం ఎంతో విశిష్టమైనదని, దానిపై ప్రతిఒక్కరు అవగాహన కలిగించుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్ డాక్టర్ శర్వాణి చెప్పారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఈనెల 1న నెల్లూరు సమీపంలోని బుజబుజనెల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, మానవ శరీరంలో కళ్ళు ఎంతో ప్రధానమైనవని, కళ్లే లేకుంటే అంతా అంధకారమేనన్నారు. నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపును ప్రసాదించే అవకాశం కలుగుతుందన్నారు. పీఎంపీ అసోసియేషన్ వారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్, డి.శ్రీనివాసులు, రామరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్‌కి వైకాపా నేతల నివాళి



దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఈనెల 2న నెల్లూరు నగరంలో వైకాపా నేతలు, అభిమానులు వైఎస్‌ను స్మరించుకుంటూ నివాళులర్పించారు. మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత తదితరులు స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకాణి మాట్లాడుతూ, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి పరిపాలన ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుందన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి మాట్లాడుతూ, తన పరిపాలనా దక్షతతో భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మహానేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి అని కీర్తించారు. రాజశేఖర్‌రెడ్డి ఆశయాల బాటలో నడుస్తూ, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి గత అయిదేళ్లలో ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు.

## డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో..
# తెలుగుభాషా వైభవోత్సవాలు



నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో ఇటీవల తెలుగుభాషా వైభవోత్సవాలు జరిగాయి. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ ఉత్సవాల్లో విద్యార్థులకు తెలుగు భాషా వైభవాన్ని ఉపాధ్యాయులు వివరించారు. తెలుగు సాహిత్యానికి ఎనలేని ప్రఖ్యాతిని తెచ్చిన శ్రీకృష్ణదేవరాయలు, తెలుగునాట మహాకవులైన కవిత్రం(నన్నయ-తిక్కన-ఎర్రన), వ్యావహారిక తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు తదితరుల వేషధారణలతో విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని తెలియజేసే 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గీతానికి దీక్షిత, నక్షత్ర నాట్యాభినయం చేశారు. విద్యార్థులు 'పరమానందయ్య శిష్యుల కథ'ను నాటికగా మలచి వినోదాత్మకంగా ప్రదర్శించారు. తెలుగువారి భాష, సంస్కృతుల గొప్పదనాన్ని కూడా వివరించారు. తెలుగు పదాల విశిష్టతను తెలుగు ఉపాధ్యాయురాలు రాధిక వివరించారు. ఈ వేడుకల్లో డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి పాల్గొన్నారు.

## భుజం నొప్పి స్క్రీనింగ్‌లకి..
# అపోలో ఆసుపత్రిలో రాయితీ



భుజం నొప్పితో ఎంతోకాలంగా బాధపడుతున్న వారి కోసం నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు. ఇటీవల ఆసుపత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ ఈ విషయమై మాట్లాడుతూ, కేవలం 999రూపాయలకే స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 31వతేదీ వరకూ ఈ రాయితీ సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. అపోలో హాస్పిటల్ రోబోటిక్ ఆర్థోప్లాస్టీ డాక్టర్ వివేకానందరెడ్డి, రోబోటిక్ జాయింట్ రీ ప్లేస్‌మెంట్ నిపుణులు డాక్టర్ ఎమ్.శశిధర్‌రెడ్డి, జాయింట్ రీ ప్లేస్‌మెంట్ సర్జరీ నిపుణులు డాక్టర్ సి.విక్రమ్‌రెడ్డితో కలిసి... నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో డాక్టర్ శ్రీరామ్ సతీష్ విలేకర్లతో మాట్లాడారు. భుజం నొప్పితో బాధపడే వారికి రూ.999 ప్యాకేజీలో భాగంగా డాక్టర్ కన్సల్టేషన్‌తో పాటు ఆర్‌బీఎస్, సీబీసీ, యూరిక్ యాసిడ్, క్రియాటిన్, ఎక్స్‌రే, భుజం నొప్పికి పరీక్షలను నిర్వహిస్తామన్నారు. అవసరమైనవారికి విజయవంతంగా శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నామన్నారు. అత్యాధునికి రోబోటిక్ విధానంతో తమ వైద్య బృందం భుజం నొప్పిని నివారించగలదని వెల్లడించారు. ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుభాషకి 'గిడుగు' సేవలు అపారం



గ్రాంధిక భాషలో ఉన్న తెలుగును ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చిన ఘనత గిడుగు రామమూర్తి పంతులుకే దక్కుతుందని యువ భారత్ జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి చెప్పారు. ఇటీవల నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జాకీర్ హుస్సేన్‌నగర్‌లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా "తెలుగు-వెలుగు" అనే అంశంపై కవిసమ్మేళనం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి సవర భాష నేర్చుకోవడమే కాదు, ఆ భాషలో పుస్తకాలు రాసి, సొంత డబ్బుతో పాఠశాలలు పెట్టి 'సవరల'కు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లుచేసిన మహనీయుడని అందరూ కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూలు కరెస్పాండెంట్ అందే శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ బి.రమేష్‌బాబు, ఉపాధ్యాయులు అంకబాబు, బాలకవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ తెలుగుజాతి ఆత్మగౌరవమైతే..

# చంద్రబాబు తెలుగువారి ఆత్మవిశ్వాసం

### ○ బాబుకి ఆనం అభినందనలు



నారా చంద్రబాబునాయుడు తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి సెప్టెంబర్ 1కి 30 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యమంత్రికి తన అభినందనలు తెలిపారు. మంత్రి ఆనం చంద్రబాబుని ప్రశంసిస్తూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా హైటెక్ సిటీ, సైబరాబాద్, శంషాబాద్ విమానాశ్రయం వంటి ప్రాజెక్టుల ద్వారా హైదరాబాద్ రూపురేఖలను పూర్తిగా మార్చిన ఘనత చంద్రబాబునాయుడిదే అని గుర్తుచేశారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం సీఎం పదవి చేపట్టిన చంద్రబాబు అమరావతి రాజధాని రూపకల్పన, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విశాఖను ఆర్థిక, ఐటీ రాజధానిగా అభివృద్ధి, రాయలసీమలో పారిశ్రామిక పెట్టుబడులు ఆకర్షించడం వంటి పలు ప్రధాన కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయం అన్నారు.

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగువారి "ఆత్మ గౌరవం" అయితే... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుగువారి "ఆత్మ విశ్వాసం" అని బలంగా చెప్పొచ్చని అన్నారు. కష్టకాలాల్లోనూ పార్టీకి అండగా నిలబడి, ఎప్పటికప్పుడు క్యాడర్‌కి ధైర్యం నింపుతూ, ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ వచ్చిన చరిత్ర చంద్రబాబునాయుడిదేనని అన్నారు.

ఆనాడు హైటెక్‌సిటీతో హైదరాబాద్‌లో రూపురేఖలు మార్చిన చంద్రబాబు, నేడు అమరావతిలో క్వాంటమ్‌వ్యాలీకి రూపకల్పన చేస్తూ కొత్త తరం అభివృద్ధికి బలమైన పునాదులు వేస్తున్నారని అన్నారు. అప్పట్లో సాఫ్ట్‌వేర్ రంగానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు, నేడు పెరుగుతున్న సాంకేతికతను ఏ.ఐ ద్వారా అందిపుచ్చుకుంటున్నారని, అదే ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. అలాంటి విజనరీ నాయకుడి సారథ్యంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి ఆనం తెలిపారు.

## అపురూప ఆవిష్కరణలకి బ్రాండ్..సీబీఎన్! - కొనియాడిన సోమిరెడ్డి



సీబీఎన్ (చంద్రబాబునాయుడు) అంటేనే అపురూపమైన ఎన్నో ఆవిష్కరణలకు ఒక బ్రాండ్ వంటివారని మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు.. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. రాష్ట్ర ప్రగతికి సారథి అయిన చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి సెప్టెంబరు 1వ తేదీ నాటికి సరిగ్గా 30 ఏళ్లని, ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. వారి నేతృత్వంలోని మూడు మంత్రివర్గాల్లో తాను పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఇంకా మంచి భవిష్యత్తు ఉండాలని, ప్రజల కోసం మరింత కష్టపడే శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నానన్నారు.

# ధవళేశ్వరంలో ఎస్.పి.బాలు విగ్రహం!

### స్మారకానికి నోచుకోని నెల్లూరు



మన నెల్లూరు గానాలపట్టి, భారతీయ సినిమా గాయకులు కీర్తిశేషులు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని ధవళేశ్వరం జలవనరుల శాఖ కార్యాలయ ప్రాంగణంలో బాలు అభిమానులు ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని ఆగష్టు 30వతేదీ శనివారం రాజమహేంద్రవరం (రూరల్) శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆవిష్కరించారు. బాలు కుటుంబ సభ్యులు ఎస్పీ శైలజ, శుభలేఖ సుధాకర్‌తో పాటు బాలు అభిమానులు, సంగీతప్రియులు ఈ కార్యక్రమంలో పాల్గొని గానగంధర్వుడిని స్మరించుకున్నారు. దక్షిణ భారతదేశంలోని కర్నాటక, తమిళనాడు, కేరళలతో పాటు మన తెలుగు రాష్ట్రాలలో కూడా అనేకచోట్ల బాలసుబ్రహ్మణ్యం విగ్రహాలు లేదా ఆయన పేరుతో మార్గాలు, స్మారకాలు ఏర్పాటవుతున్నాయి. బాలు దివంగతులై నాలుగేళ్ళు పూర్తయినా.. ఆయన స్మారకం కానీ, విగ్రహం కానీ ఆయన సొంత జిల్లాకేంద్రం నెల్లూరులో ఏర్పాటు కాకపోవడం శోచనీయం.




## ఉత్తరక్రియలు



కీ॥శే॥ మావిళ్ళపల్లి సీతారామమ్మ గారు
(W/o లేట్ మామిళ్ళపల్లి వాసవి రమణయ్యనాయుడు గారు)
చౌటపాళెం (గ్రా), వెంకటాచలం (మం)
మరణం : 27.08.2025

మంచితనానికి మారుపేరుగా నిలచి,
మా అందరి హృదయాలలో చెరగనిముద్ర వేసిన
మా ఇంటి ఇలవేల్పు

**శ్రీమతి మావిళ్ళపల్లి సీతారామమ్మ గారు**

మమ్ములను వదలి కానరాని దూరాలకు వెళ్ళినా,
వారి మధురస్మృతులను స్మరించుకుంటూ..
ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ..
అశ్రునయనాలతో శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమార్తెలు - అల్లుళ్లు
ముువ్వా భూదేవమ్మ - మువ్వా పద్మయ్య
వింజం ఉమామహేశ్వరి - వింజం శివరామకృష్ణ

మనుమలు - మనుమరాళ్ళు
మువ్వా మహేష్‌బాబు
మువ్వా అజయ్‌బాబు - మువ్వా శ్రీనిత
వింజం చంద్రశేఖర్
డా. పచ్చా నీరజ - డా. పచ్చా రజనీకాంత్
వింజం వినీల - డా. యల్లంపల్లి కిశోర్
మరియు కుటుంబసభ్యులు

**పెద్దకర్మ :** తేది. 10.9.2025 బుధవారం, ఉదయం 10.30 గంటలకు నెల్లూరు, శాంతినగర్ 2వ వీధిలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.



# ఏఎంసీకి కొత్త నాయకులు

## చైర్మెన్, వైస్‌చైర్మెన్‌లతో పాటు 13 మంది డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

నెల్లూరు జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీకి నూతన కార్యవర్గం ఏర్పడింది. కమిటీ చైర్మెన్‌గా మనుబోలు శ్రీధర్‌రెడ్డి, వైస్‌చైర్మెన్‌గా రాపూరు చంద్రశేఖర్‌తో పాటు 13 మంది డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల నెల్లూరు మాగుంట లేఔట్ లోని పిచ్చిరెడ్డి కళ్యాణమండపంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మెన్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జనసేన నాయకులు పావుజెన్ని చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, కమిటీ కొత్త నాయకులను అభినందించారు. నెల్లూరు మార్కెటింగ్ కమిటీ లాభదాయకంగా ఉండేందుకు అందరూ కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి ఎప్పటికైనా మంచి రోజులు ఉంటాయని మంత్రి భరోసా ఇచ్చారు. 1971లో మార్కెటింగ్ కమిటీ తొలిసారి ఏర్పడిందని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషిచేస్తున్నారని, అదేవిధంగా నూతన కమిటీవారు కూడా రైతులు, వ్యాపారులకు అనుసంధానంగా పనిచేయాలని సూచించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రూరల్ నియోజకవర్గంలో సుమారు 200 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేసి అందరి మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ సభ్యులు రైతుల అభిమానాన్ని పొందాలని సూచించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డ్ చైర్మెన్ అబ్దుల్ అజీజ్‌లు కమిటీ కొత్త నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులను దగా చేస్తున్న దళారులు

**• బీజేపీ నేత వంశీధర్‌రెడ్డి**

జిల్లాలో వరి రైతులను దళారులు మోసం చేస్తున్నారని, ప్రభుత్వాలు ప్రకటించిన మేరకు ధాన్యానికి మద్దతు ధర ఇవ్వకుండా రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తక్కువ ధరనే ఇస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. ఈనెల 1న ఆయన బుచ్చిలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా పదాధికారుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులను దగా చేస్తున్న దళారులను అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# అర్హులందరికీ పింఛన్లు

జిల్లాలో అర్హులైన వారందరికీ పింఛన్లు ఉంటాయని, ఈ విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి చెప్పారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీలోని చంద్రమౌళినగర్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ఈనెల 1న పరిశీలించారు. ఇటీవల ఆపివేసిన విభిన్న ప్రతిభావంతుల పింఛన్ల విషయంలో యాప్‌లో నమోదుచేసుకున్న వారందరికీ సదరం వెరిఫికేషన్‌లు వస్తాయని, వారు వెళ్ళి ఆ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

# రేషన్ బియ్యం పట్టివేత

ప్రభుత్వం ఎన్ని కఠిన నిబంధనలు అమలుచేస్తున్నా, రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉంది. ఇలా అక్రమంగా రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ఓ వాహనాన్ని బుచ్చిరెడ్డిపాళెం టోల్ ప్లాజా వద్ద ఈనెల 2న పౌరసరఫరాల శాఖ, రెవిన్యూ అధికారులు కలసి పట్టుకుని, ఆ వాహనంలో 75 బస్తాల్లో ఉన్న సుమారు 2700 కేజీల రేషన్‌బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమరవాణాకి పాల్పడుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# బహుళధ్రువ ప్రపంచం దిశగా భారత్ అడుగులు

**మనసులో మాట 61**

టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (SCO) సదస్సు ఒక సాధారణ సమావేశంలా ముగిసిపోలేదు. ఏకధ్రువ ప్రపంచాన్ని అంగీకరించబోమని స్పష్టమైన సంకేతాలిచ్చింది. ముఖ్యంగా భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగం, ఆయన ముఖ్యనేతలతో సమావేశమయిన తీరు దృఢమైన భారత వైఖరికి అద్దం పట్టింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ వేదికను వ్యూహాత్మక ప్రయోజనాలను సాధించుకోవడానికి సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాలకు వ్యతిరేకంగా భారత్ నిలబడగలదని చూపించడానికి, అలాగే పాకిస్తాన్ ఉగ్రవాద ప్రమేయంపై అంతర్జాతీయ దృష్టిని కేంద్రీకరించడానికి ఈ వేదికను ఉపయోగించుకున్నారు. ఏడేళ్ల అనంతరం ప్రధాని మోదీ చైనా పర్యటనలో పాల్గొన్నారు. అన్ని రంగాల్లోనూ తనకు పోటీగా దూసుకొస్తున్న చైనాను అడ్డుకోవడానికి ఇన్నాళ్లు అమెరికా భారత్‌తో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకుంటూ వచ్చింది. మరోవైపు పాకిస్థాన్‌కు అండగా ఉంటూ సరిహద్దుల్లో మనకూ చికాకులు కలిగిస్తున్న చైనాకు చెక్ పెట్టేందుకు భారత్ కూడా అమెరికాతో వ్యూహాత్మక సంబంధాలు కొనసాగిస్తూ వచ్చింది. కానీ ఇటీవల కాలంలో ట్రంప్ పాక్‌కు వంతపాడుతూ భారత్‌పై నిర్హేతుకంగా సుంకాలు విధించడంతో భారత్ గట్టి సందేశం ఇవ్వక తప్పలేదు. చైనా కూడా ఇదే అవకాశంగా భావించి భారత రాష్ట్రపతికి లేఖ రాశారని, భారత్‌తో సంబంధాలను కొత్త దిశగా మలుచుకునే విషయమై అందులో ప్రస్తావించారని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే షాంఘై సహకార సమావేశంలో ముఖ్యనేతలైన మోదీ, జిన్‌పింగ్, పుతిన్‌ల భేటీ ఒక విస్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. అమెరికా ఒంటెత్తు పోకడలకు తలూపబోమని, బలమైన కొత్త కూటమి అవతరిస్తుందని సంకేతమిచ్చింది. అదే సమయంలో భారతదేశ ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని చైనాకు కూడా మోదీ తన ప్రసంగంలో గట్టిగానే సంకేతమిచ్చారు. పహల్గాం ఉగ్రదాడిని షాంఘై సహకార సంస్థ సదస్సు తీర్మానం ఖండించడం మోదీ సాధించిన ఘన విజయం. "ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరి అంగీకారయోగ్యం కాదు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా కలిసికట్టుగా ఎదుర్కోవాలి" అని ఆయన గట్టిగా చెప్పారు. గతంలో చైనాలోనే జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో పహల్గాం అంశాన్ని చేర్చకపోవడంతో మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆనాటి తీర్మానంపై భారత్ సంతకం చేయబోదని నిరాకరించారు. అప్పుడు చైనా ప్రభావమే పహల్గాం అంశాన్ని చేర్చకపోవడానికి కారణం. తాజాగా మోదీ ప్రసంగంలోని ఉగ్రవాద అంశం ప్రస్తావనకు రావడం, తీర్మానంలో చేర్చడం పాకిస్థాన్‌కి దౌత్యపరమైన పరాజయం. భారత్‌తో సత్సంబంధాల అవసరాన్ని చైనా గుర్తించిందనడానికి నిదర్శనం. ఇక చైనా ముఖ్యమైన ప్రాజెక్టు బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌పై మోదీ చైనాలోనే అభ్యంతరాలు వ్యక్తం చేయడం భారత్ దృఢవైఖరికి నిదర్శనం. అనుసంధానం అనేది సార్వభౌమత్వాన్ని గౌరవించాలని మోదీ నొక్కి చెప్పారు. సార్వభౌమత్వాన్ని పక్కన పెట్టే అనుసంధానం నమ్మకాన్ని కోల్పోతుందని స్పష్టం చేశారు.

### బాడీ లాంగ్వేజ్‌తో రాజకీయ సందేశం

రాజకీయాల్లో మాటల కంటే చిత్రాలే బలంగా మాట్లాడతాయి. టియాంజిన్‌లో మోదీ, పుతిన్ మధ్య అనుబంధం పలు వీడియోలు, ఫోటోలలో స్పష్టంగా కనిపించింది. ఇద్దరూ ఒకే కారులో ప్రయాణించడం, ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం, వంటి దృశ్యాలు భారత్–రష్యా సంబంధాలు ఎంత దృఢంగా ఉన్నాయో చూపించాయి. వారి భేటీ అనంతరం రష్యా నుంచి దిగుమతి చేసుకునే చమురు ధరలు మరింత తగ్గడం విశేషం. ఇది ట్రంప్‌కి మరో షాక్. మరోవైపు, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పక్కనే నిలబడి ఉన్నప్పటికీ మోదీ ఆయనను పట్టించుకోకపోవడం పాకిస్థాన్ ఒంటరితనాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. మోదీ, పుతిన్, జిన్‌పింగ్ నవ్వుతూ మాట్లాడుకోవడం కొత్త కూటమి బలంగా అవతరించబోతోం దనడానికి సంకేతం. అంతర్జాతీయ వేదికలలో బాడీ లాంగ్వేజ్ ఎంత శక్తిమంతమైన రాజకీయ సందేశాన్ని ఇస్తుందో ఈ దృశ్యాలు నిరూపించాయి.

సదస్సులో మరో కీలక ఘట్టం మోదీ–షి జిన్‌పింగ్ చర్చలు. ఏడేళ్ల తర్వాత చైనా గడ్డపై ఇద్దరు దేశాధినేతలు కలుసుకోవడం ఒక చారిత్రాత్మక పరిణామం. భారత–చైనా సంబంధాలను అమెరికా నిర్ణయించలేదు, భారత్ తన విదేశాంగ విధానాన్ని తన స్వప్రయోజనాల ఆధారంగానే నడుపుకుంటుంది అని ఈ భేటీ నిరూపించింది. సరిహద్దు వివాదాలు, వాణిజ్య లోటు, పాకిస్తాన్‌కి చైనా అండ వంటి అంశాలు ఇంకా పరిష్కారం కానప్పటికీ ట్రంప్ విధించిన సుంకాల ఒత్తిడిలో భారత్, చైనా దగ్గరవ్వడం కొత్త ప్రపంచ క్రమానికి నాంది పలికింది.

సదస్సు మొత్తంలో ఒకే సందేశం స్పష్టంగా కనిపించింది. భారతదేశం ఎవరికీ తలొగ్గదు. సుంకాలు, ఒత్తిళ్ళు, ఉగ్రవాదం ఏది ఎదురైనా భారత్ తన దారిలోనే నడుస్తుంది. చైనా, రష్యాలతో భాగస్వామ్యం పెంచుకోవడం అమెరికాతో సంబంధాలలో ఉద్రిక్తతకు దారితీసే అవకాశం ఉన్నప్పటికీ, భారత్ తన జాతీయ ప్రయోజనాలనే ప్రధానంగా పరిగణిస్తుంది. ట్రంప్ కల్లోలం కారణంగా భారత్ తన వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. ఈ సదస్సు, అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్ ఒక కొత్త, స్వతంత్ర పాత్ర పోషించబోతోందని ప్రపంచానికి చాటి చెప్పింది. ఇది సరికొత్త భారత్. నిటారుగా నిలబడుతుంది.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




## నెల్లూరులో బీజేపీ నాయకుల నిరసన

ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై కాంగ్రెస్ నేత అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ, ఈనెల 1న నెల్లూరులోని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళా మోర్చా జిల్లా శాఖ అధ్యక్షురాలు కరణం సుభాషిణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి, నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన బిజ్జంపల్లి రైతులు

యూరియా ఎరువును అందుబాటులో ఉంచాలంటూ ఈనెల 2న ఉదయగిరి మండలంలోని బండగానిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న బిజ్జంపల్లి గ్రామంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. యూరియా అందుబాటులో లేకపోవడం వల్ల ఈ వ్యవసాయ సీజన్‌లో రైతులు బాగా ఇబ్బందిపడుతున్నారని, రైతు భరోసా కేంద్రాల్లో యూరియాను పంపిణీచేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సేద్యం పనులు వదులుకుని రైతులు యూరియా కోసం ఎక్కడ తిరిగినా దొరకడం లేదన్నారు. అదేవిధంగా పండించిన పంటకు తగ్గ గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యలన్నిటినీ ఇంకా ఎంతకాలం భరించాలంటూ అనేకమంది రైతులు సేద్యంపై విరక్తి పెంచుకుంటున్నారని ఆయన అన్నారు. ఆ గ్రామానికి చెందిన అనేకమంది రైతులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

## ఇళ్ళ పన్ను బకాయిలపై ఏఐవైఎఫ్ ధర్నా

ఏళ్ళ తరబడిగా పెండింగ్‌లో ఉన్న ఇంటిపన్ను బకాయిలు ఒకేసారి వేసి, వెంటనే చెల్లించాలంటూ కార్పొరేషన్ వాళ్ళు వత్తిడి తెస్తున్నారని, బకాయిలు కట్టకుంటే ఇళ్ళకు తాళం వేయిస్తామని సచివాలయ సిబ్బంది బెదిరిస్తున్నారంటూ ఈనెల 1న నెల్లూరునగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీలో ఉన్న సచివాలయం వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాందోళన నిర్వహించారు. ఇక్కడున్న ప్రజలు గత 35ఏళ్లుగా ఇళ్లపట్టాలకు రిజిస్ట్రేషన్ లేక నానా బాధలు పడుతున్నారని, ఈ నేపథ్యంలో స్థానికులపై పన్నుల భారం మోపడం దారుణమని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె షానవాజ్, వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు లీలామోహన్ విమర్శించారు. స్థానిక ప్రజలు అధికశాతం మంది పేదవాళ్ళని, రోజువారీ కూలీలుగా జీవనం సాగిస్తున్న వారిపై పన్నుల భారం వేస్తే వారెలా తట్టుకోగలరని ప్రశ్నించారు. ఇళ్ళ పన్నుల్లో వడ్డీని మినహాయించి, విడతలవారీగా బకాయిలు కట్టించుకోవాలని వారు సూచించారు. పన్నుల పేరుతో ప్రజలను ఇబ్బందిపెడితే సహించేది లేదని వారు స్పష్టం చేశారు.

## ఫీజు రీ-యింబర్స్‌మెంట్ కోసం 6న ఎస్ఎఫ్ఐ 'చలో విజయవాడ'

విద్యారంగ సమస్యలన్నీ తీరుస్తామని హామీలిచ్చిన టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సమస్యలనేమీ పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీ-యింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈనెల 6న 'చలో విజయవాడ' కార్యక్రమం చేపడుతున్నారు. ఆమేరకు వాల్‌పోస్టర్లను ఈనెల 2న నెల్లూరులోని రామచంద్రారెడ్డిభవన్‌లో ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం జీఓ నంబరు 77ని రద్దుచేయాలని, అదేవిధంగా మెస్‌చార్జీలను పెంచాలని కోరారు. 'చలో విజయవాడ' కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాల్లో అవినీతిని..త్వరలోనే బయటపెడతా!

## - ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



జిల్లాలోని పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించే విషయంలో గతంలో జరిగిన అవినీతిని త్వరలోనే బయటపెడతానని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన తోటపల్లి గూడూరు మండలం పేడూరు పంచాయతీ పరిధిలోని కొలి దిబ్బలో గిరిజనుల కోసం నిర్మిస్తున్న పక్కా ఇళ్లని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ హయాంలో ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగా అనేకమంది అధికారులు సస్పెండ్ అవుతున్నారన్నారు. విజిలెన్స్ విచారణ చేపడితే మొదటి దశలోనే రూ.110 కోట్ల అవినీతి వెలుగులోకి వచ్చిందని, నాణ్యతా ప్రమాణాల విషయంలో విచారణ జరిపితే మరో రూ.100 కోట్లకు పైగా అవినీతి బయటపడవచ్చని అన్నారు. గృహనిర్మాణ శాఖలో జరిగిన మరిన్ని అవినీతి లీలలను కూడా వెలికితీస్తున్నామన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజనులు, దళితులు, బీసీల ఇళ్ల నిర్మాణానికి మళ్లీ అదనపు నిధులు మంజూరు చేస్తోందన్నారు. రూ.2.55 లక్షల్లో ప్రతి రూపాయిని సద్వినియోగం చేసి గిరిజనులకు నాణ్యమైన ఇళ్లు నిర్మించాలని తమ నాయకులకు సూచించామని, అవసరమైతే సొంత డబ్బులు కూడా ఖర్చు చేయాలని కూడా చెప్పామని ఆయన తెలిపారు. పేద కుటుంబాలు పది కాలాల పాటు ఆ ఇళ్లలో ఉండేలా ఇళ్లను పటిష్టంగా నిర్మించాలని కోరుకుంటున్నానన్నారు.

## జగన్ నియంత పోకడలను మానాలి

ప్రతిపక్ష హోదా అన్నది అడుక్కుంటే వచ్చేది కాదని, ప్రజలివ్వాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వైకాపా నాయకుల తీరును ఈ సందర్భంగా సోమిరెడ్డి తూర్పారబట్టారు. జగన్‌రెడ్డి ఇంకా నియంత పోకడల నుంచి బయటకు రాలేకపోతున్నాడన్నారు. ఈనెల 2న ఆయన నెల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైకాపా వారు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొటారు. 'గొడ్డలి పోటుతో చిన్నాయన్ని లేపేసిన మీరా మా నాయకుడి గురించి మాట్లాడేది?'.. అని ఆయన ప్రశ్నించారు. 'మీరు మీ చిన్నాయనపై గొడ్డలి పోటు వేసి, ఆ నెపాన్ని మాపై నెట్టి 2019 ఎన్నికల్లో గెలిచారు. ప్రజలు అంతా గ్రహించాకే మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు' అని ఆయన అన్నారు. ఇప్పటికైనా కొంచెం కాకపోతే కొంచెమైనా బుద్ధితో మాట్లాడాలని చురకంటించారు. గతంలో సకల శాఖల మంత్రిగా వెలగబెట్టిన సజ్జల వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంట!..అయినా, ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం ఎన్నిసార్లు అడుక్కుంటారు?..అని ఆయన వైకాపా నేతల్ని ప్రశ్నించారు. పులివెందుల జడ్పీటీసీని గెలిపించుకోలేని జగన్‌రెడ్డిని కలవాలంటే ఎంట్రీపాస్ ఉండాలంట.. అంటూ జగన్ తీరును ఆయన ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గం, సొంత మండల ప్రజలు కలవాలంటే కూడా పాస్ తీసుకోవాలంట, ఇవన్నీ జగన్‌రెడ్డి నియంతపోకడలకు నిదర్శనం కాదా అని ఆయన ప్రశ్నించారు.

## మా రాజకీయ ప్రస్థానం కూడా.. పీఏసీఎస్‌లతోనే

పాలకవర్గాలతో పీఏసీఎస్‌లు బలోపేతం కావాలని, తమ రాజకీయ ప్రస్థానం కూడా పీఏసీఎస్ ఛైర్మన్‌తోనే ప్రారంభమైందని, సోమిరెడ్డి చెప్పారు. ఇటీవల తోటపల్లి గూడూరు మండలం పేడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని, కొత్త ఛైర్మెన్ గూడూరు నారాయణ, డైరెక్టర్లు దేవరాల ప్రవీణ్, మేనాటి శీనయ్యలకు అభినందనలు తెలిపారు. గతంలో తన సోదరుడు సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా పీఏసీఎస్ ఛైర్మెన్‌గా సేవలందించారని గుర్తుచేశారు. రైతులకు సేవలందించడంలో పేడూరు పీఏసీఎస్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. రైతుల విషయంలో కూటమి ప్రభుత్వం రాజీ పడకుండా పనిచేస్తోందని, అదే స్ఫూర్తితో కొత్త పాలకవర్గాలు కూడా ముందుకు సాగాలని సోమిరెడ్డి సూచించారు.

## రౌడీయిజాన్ని అణిచేయాలి

నెల్లూరులో రౌడీషీటర్ల ఆగడాలు పెరిగిపోతున్నాయని, రౌడీల ఆగడాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వైసీపీ అరాచక మూలాలతోనే తాజా పరిణామాలని ఆయన అంటూ, అరాచక శక్తులను కూకటివేళ్లతో సహా పెకిలించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ అవసరమన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హత్యకు కుట్ర వెనకున్న అసలు వ్యక్తులెవరో తేలాలన్నారు. నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్ రెడ్డితో ఈనెల 2న భేటీ అయిన సోమిరెడ్డి, ఈ సందర్భంగా కోటంరెడ్డికి సంఘీభావం ప్రకటించి తాజా పరిణామాలపై చర్చించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అప్పట్లో వైసీపీని వీడుతున్నారని ఏకంగా హత్య చేసేందుకే కుట్ర చేశారంటే రౌడీయిజం ఏ స్థాయికి చేరిందో అర్థమవుతోందన్నారు.ఆ క్రిమినల్స్‌కు వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు.

---

తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## ఉపాధ్యాయులకి క్రీడా పోటీలు



విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే గురువులకు క్రీడా పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయదినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను ఆగస్టు 31న నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. తరగతి గదుల్లో నిరంతరం గడిపే ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చంద్రశేఖర్, ధనుంజయ్‌రెడ్డి, శ్రీనివాసులు, మస్తాన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 13న జాతీయ లోక్‌అదాలత్



నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రతి సంవత్సరం నాలుగు సార్లు నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా మూడవ జాతీయ లోక్‌అదాలత్ సెప్టెంబర్ 13న నిర్వహించబోతున్నామని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సులోచనారాణి తెలిపారు. అన్ని రకాల కేసులలో ఇరువర్గాల పరస్పర అంగీకారంతో రాజీ పడదలచిన వారు లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని, లోక్‌అదాలత్ ధ్యేయం రాజీమార్గమే రాజమార్గమని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అలఘునాథస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం





గూడూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ అలఘునాథ స్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణస్వీకారం ఈ నెల 1వ తేదీ దేవాలయ ప్రాంగణంలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సమక్షంలో ఆలయ ఈవో వై.శశాంక్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. దేవస్థానం ఛైర్మెన్‌గా బత్తిన సుధాకర్, కమిటీ మెంబర్లుగా కడివేటి రామమూర్తి, కె.నాగూర్, తూపిలి సురేంద్ర, వాశిలి పావని, బొర్రా విజయలక్ష్మి, నందిమండలం శశికళ, పదపర్తి నాగమణి, కనకలూరు రాజేశ్వరిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ మాట్లాడుతూ అన్ని కులాలవారికి ప్రాధాన్యత కల్పిస్తూ ఆలయ కమిటీని ఏర్పరచామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు శీలం కిరణ్‌కుమార్, చెంచురామయ్య, నెలబల్లి భాస్కర్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

### కడివేటికి బ్రాహ్మణ సంఘం సత్కారం

అలఘునాథస్వామి ఆలయ కమిటీ మెంబర్ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా కడివేటి రామమూర్తిని గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గసభ్యులు చిట్టమూరు శ్రీనివాసరావు, వి.లలితమ్మ, కె. వెంకటేశ్వరరావు, నరసింహన్, కె.రాజానారాయణ, వి.ప్రకాశం తదితరులు ఘనంగా సన్మానించారు. అదే తరుణంలో గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, ఈవో శశాంక్‌కుమార్‌లను కూడా సన్మానించారు.

## మరువలేని మహానేత డాక్టర్ వైఎస్ఆర్

### - చేవూరు విజయమోహన్‌రెడ్డి



దివంగత మహానేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారని గూడూరు వైసీపీ నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి వెల్లడించారు. వైయస్సార్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 2న గూడూరు పట్టణం, శాంతినగర్ సమీపంలో ఉన్న వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవూరు విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాల వల్ల ఎంతోమంది ప్రాణాలు నిలిచాయని, ఎంతోమంది ఉన్నతస్థాయి ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. మల్లు విజయ్ కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, కోడూరు మీరారెడ్డి, కల్పలత, సుభాన్, పూర్ణ, రాజేష్, సుజనా తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్ట్

డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీల కేసులకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందని రూరల్ సీఐ కిషోర్‌బాబు తెలిపారు. ఈ నెల 2వ తేదీ స్థానిక రూరల్ పోలీస్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓజిలి మండలం ఆర్మేనిపాడు గ్రామానికి చెందిన చిన్నబ్బయ్య, పోలయ్య అనే ఇద్దరు నిందితులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైరును అపహరించుకు వెళుతుంటారని, ఈనెల1న కందలి గ్రామ సమీపంలో వీరిద్దరినీ అరెస్ట్ చేసి, వీరి నుంచి 135 కేజీల రాగి తీగలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

## తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



గూడూరు రూరల్, ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లను తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని, నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లేడీ డాన్ అరుణ, శ్రీకాంత్ వ్యవహారంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని,ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉన్న కొంతమందిని అరెస్ట్ చేసి, మరికొంతమందిని బైండోవర్ చేసుకున్నామన్నారు. వెంకటగిరి పోలేరమ్మ జాతరకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. డీఎస్పీ గీతాకుమారి, రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కిషోర్‌బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## నిరుపేదలకు అండగా.. ముఖ్యమంత్రి సహాయనిధి

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 24 మంది పేదలకు 21 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఇటీవల పంపిణీ చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆర్థిక స్థోమత లేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి సంజీవినిలా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అండగా ఉంటూ నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు.

# అటు కలహం.. ఇటు స్నేహం

(మొదటిపేజీ తరువాయి)

తనదైన వ్యూహచతురతతో సమస్యలను సదావకాశంగా ఆంక్షలనే ఆయుధాలుగా చేసుకుని తదేక దీక్షతో ఆయన ముందుకు సాగుతున్న వైనం అసామాన్యమనే చెప్పాలి. ఎందుకంటే ఉక్రెయిన్‌పై దురాక్రమణకు పాల్పడుతున్నారనే కారణంతో ప్రపంచ దేశాలన్నీ రష్యాపై ఆంక్షలు విధించినా వెనుకడుగు వేయకుండా ఆ దేశంతో మైత్రిని కొనసాగిస్తున్నారు. దీనికి కృతజ్ఞతగా రష్యా భారత్‌కు అతిచౌకగా ముడిచమురును సరఫరా చేస్తోంది. ఈ ముడి చమురును తన అవసరాలకే కాకుండా ఇతర దేశాలకూ కొంత మొత్తానికి అమ్ముకుని భారత్ విదేశీ మారక ద్రవ్యలోటునూ పూడ్చుకుంటోంది. దీంతో భారత్ ఎదుగుదలను చూసి ఓర్వలేక ఏకంగా మన ఎగుమతులపై 50 శాతం టారిఫ్‌లను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించారు. అంతేకాక భారత్‌లో పహల్గాం దాడికి ఉగ్రవాదులను ఉసిగొలిపాడనే ఆరోపణలున్న పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మున్నీర్‌ను వైట్‌హౌస్‌కు పిలింపిచుకుని మరీ విందు ఇచ్చారు. దీంతో తనదైన మార్కు రాజకీయాలతో మోదీ రష్యాతో పాటూ చైనాతో స్నేహానికీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. తద్వారాఆ అటు అమెరికాకు, ఇటు పాకిస్థాన్‌కు దిమ్మదిరిగే కౌంటర్ ఇచ్చారు. ఏకంగా పాకిస్థాన్ అధ్యక్షుడి సమక్షంలోనే షాంఘై సహకార సంస్థ వేదికగా పహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రదాడిని ఖండిస్తూ తీర్మానాన్ని తీసుకొచ్చారు. వాటిపై రష్యా, చైనా అధ్యక్షులతో సంతకాలు చేయించి అతిపెద్ద దౌత్యవిజయాన్ని సాధించారు. ఇదే క్రమంలో పసిపిక్ రీజియన్‌లో పరస్పరం ఉప్పునిప్పులా ఉండే చైనా–జపాన్ రెండింటితోనూ ఒకే సమయంలో ఒప్పందాలు కుదుర్చుకుని తనదైన మార్కు చూపించారు. ఇక షాంఘై సహకార సంస్థ భేటీ తర్వాత రెండో ప్రపంచ యుద్ధంలో చైనా చేతిలో జపాన్ ఓటమిని గుర్తు చేసుకుంటూ నిర్వహించిన పరేడ్‌కు దూరంగా ఉంటానని ధైర్యంగా ప్రకటించారు. తద్వారా చైనాకు పూర్తిగా వంతపాడబోమంటూ జిన్‌పింగ్‌కి సందేశమివ్వడంతో పాటూ జపాన్ మనస్సు నొప్పించకుండా మోడీ జాగ్రత్తపడ్డారు.

### అమెరికాకు ‘మూడి’నట్లేనా..?

భారత్, చైనా, రష్యా కలయికతో అమెరికా అగ్రరాజ్య హోదాకు ముప్పువాటిల్లే ప్రమాదం పొంచివుంది. ఈ మూడు దేశాలు వాణిజ్య సహకారంతో పాటూ భద్రతకు సంబంధించిన రక్షణ ఒప్పందాలు చేసుకుంటే ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ మార్పుగా అది నిలిచిపోయే అవకాశం ఉంది. అయితే, ఇన్నాళ్లూ పాకిస్థాన్‌కు ఆయుధాలు అందిస్తూ భారత్‌కు నష్టం చేకూర్చాలని చూసిన చైనాను పూర్తిగా నమ్మడం కుదరదు. పైగా అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం మాదే, కాశ్మీర్‌లోని సియాచిన్ తమ పరిధిలోనిదే అంటూ చైనా భారత్‌పై తరచూ అవాకులు చావాకులు పేలుతోంది. ఇదే కారణంతో గల్వాన్ లోయలో ఘర్షణకు దిగన చరిత్ర ఆ దేశానికి ఉంది. ఇక భారత తొలి ప్రధాని నెహ్రూ హయాంలో 1950వ దశకంలోనే పంచశీల ఒప్పందంపై సంతకం చే సి ఆ వెంటనే మాటతప్పి భారత్‌పై యుద్ధానికి దిగి నమ్మకద్రోహానికి పాల్పడిన నీచమైన చరిత్ర కూడా చైనాకు ఉంది. అయితే ఎన్నో సమస్యల్లో మనకు అండగా నిలబడిన రష్యా భారత్–చైనా కలయికలో కీలక పాత్ర పోషిస్తుడడంతో డ్రాగన్ కంట్రీ ఈసారి నక్కజిత్తులకు పాల్పడే అవకాశం ఉండకపోవచ్చు. పైగా అమెరికాతో తనకున్న దీర్ఘకాలిక శత్రుత్వం కారణంగానైనా భారత్‌తో వివాదాలకు చైనా దూరంగా ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలో అమెరికాకు అత్యంత దగ్గరగా ఉంటూ ట్రంప్ అడుగులకు మడుగులొత్తుతున్న పాకిస్థాన్‌నూ దూరంపెట్టే ఆలోచన కూడా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చేయవచ్చు. అదే జరిగితే భారత్‌కు పక్కలో బల్లెంలా మారిన పాకిస్థాన్ ఖేల్ ఖతం కావడం తథ్యం. ఎలాగూ భారత్–చైనా–రష్యా కూటమిలో సౌదీ అరేబియా కూడా చేరుతుందనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో భారత్‌తో పాకిస్థాన్‌కు తగువొస్తే గతంలోలాగా పాకిస్థాన్‌కు ఇతర ఇస్లాం దేశాల సహకారం కూడా లభించకపోవచ్చు. ఏదేమైనా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ నాలుగు సార్లు ఫోన్ చేసినా పట్టించుకోకుండా రష్యా, చైనాతో కలిసి సాగాలని మోడీ నిర్ణయించడం భారతదేశ విదేశాంగ విధానంలోనే ఓ కీలక మైలురాయిగా మిగిలిపోనుంది. భవిష్యత్‌లో అన్నీ కుదిరి భారత్, రష్యా, చైనా త్రైపాక్షి కూటమి ఖరారైతే అమెరికా అగ్రరాజ్య ఆశలు ఆవిరైపోవడం ఖాయమని విశ్లేషకులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

### నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా!

మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మరోసారి అమెరికా అధిపత్యాన్ని నిలబెడుతాం) అంటూ రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ మాత్రం దిక్కుమాలిన టారిఫ్‌లతో, నోబెల్ శాంతి బహుమతి ఆశలతో తప్పులపై తప్పులు చేస్తూ, తాను మునగడమే కాకుండా అమెరికా పుట్టినీ ముంచుతున్నారు. ఇదే సమయంలో సంక్షోభ పరిస్థితుల్లో ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవడం, అవసరమైన సందర్భాల్లో ఆచితూచి వ్యవహరిండం వంటివి చేస్తూ భారత ప్రధాని మోడీ తిరుగులేని ఇమేజ్‌ని పెంచుకుంటున్నారు. ఇది అక్షరాల నిజం అనే ఘటన ఇటీవల చోటు చేసుకుంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని తానే చొరవ తీసుకుని నిలిపివేస్తానంటూ ట్రంప్ అనేకసార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ఆయన పుతిన్‌తోపాటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జలన్‌స్కీతోనూ చర్చలు జరిపారు. అయితే షాంఘై సహకార సదస్సుకు హాజరైన క్రమంలో పుతిన్–మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశనికి కొద్దిసేపటి ముందు, అమెరికా వద్దు అని వారిస్తున్నా ఉక్రెయిన్ అధ్యక్షుడు జలన్‌స్కీ మోదీకి స్వయంగా ఫోన్ చేసి రష్యా తమపై చేస్తున్న యుద్ధం ఆపేలా సహాయం చేయాలని కోరారు. ఈ ఘటన అంతర్జాతీయంగా భారతదేశ ప్రధానికి పెరుగుతున్న ప్రాధాన్యతను చెప్పకనే చెప్పింది. మోడీ చరిష్మాను ఆకాశమంత ఎత్తుకు పెంచింది.

మొత్తం మీద పెద్దన్నతో వచ్చిన కలహం కొత్త స్నేహాలకి తెరలేపింది. రష్యా, చైనా వంటిదేశాలతో భారత్ బంధం బలపడేలా చేసింది..!

# హాయిగొలిపే.. ‘మనసు పాటలు’

## వేద విజ్ఞాన వేదిక సభలో డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి



మంచి సంగీతంతో కూడిన పాటలు వింటుంటే మనసుకు ఎంతో ప్రశాంతత ఉంటుందని, అందులోనూ మనసు పాటలు మానసిక వత్తిడిని కూడా తగ్గిస్తాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి (విజయవాడ) చెప్పారు. చెన్నైలోని టీనగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో 164వ ప్రసంగంగా డా. రామసుబ్బారెడ్డి ‘తెలుగు సినిమాల్లో మనసు పాటలు’ అనే అంశంపై దృశ్య శ్రవణ మాధ్యమంలో అద్భుతంగా ప్రసంగించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. మనిషి భావోద్వేగాలకు, సంగీతం–సాహిత్యాలకు సంబంధం ఉందని ఆయన అంటూ, వీనులవిందైన పాటలు వింటుంటే మనసు హాయిగా ఉంటుందన్నారు. తెలుగు సినీ కవులు మనసు పాటలు రాసినా, వారిలో ప్రధానంగా ఆత్రేయ, సిరివెన్నెల ప్రసిద్ధులని అన్నారు. ఆత్రేయ వందకు పైగానే మనసు పాటలు రాసి సినీలోకంలో ప్రసిద్ధులయ్యారని కొనియాడారు. ఆత్రేయ పాటల్లో ప్రేమ, విరహం, అభిమానం, ఆత్మీయత, భగ్నప్రేమ, వేదాంతం వంటివన్నీ ఇమిడి ఉంటాయన్నారు. అందుకే ఆయన ‘మనసు కవి’గా పేరొందారన్నారు. దాదాపు 30 సినిమా పాటలను ఆయన దృశ్యశ్రవణ మాధ్యమంలో వినిపించి అందరినీ అలరించారు. తొలుత వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేయగా, అధ్యక్షులు జేకే రెడ్డి ప్రసంగకర్త ఇండ్ల రామసుబ్బారెడ్డిని సభకు పరిచయం చేశారు. తమిళనాట తెలుగువారి మాటగా ప్రఖ్యాతి చెందిన మన నెల్లూరీయులు ఆచార్య సీఎంకె రెడ్డి మనసు పాటలన్నీ విని రామసుబ్బారెడ్డి సంగీతాభిలాషని అభినందించారు. అనంతరం వేదిక నిర్వాహకులు మధు, జేకేరెడ్డి రామసుబ్బారెడ్డిని జ్ఞాపిక, శాలువతో సన్మానించారు.

## కళాంజలి అనంత్ మరో అద్భుతం.. ‘చెట్టు=తల్లి’ షార్ట్‌ఫిల్మ్ షూటింగ్ ప్రారంభం





కళాంజలి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు అనంత్ తన షార్ట్‌ఫిల్మ్‌ల నిర్మాణాల్లో భాగంగా, ఇటీవల ‘చెట్టు=తల్లి’ అనే లఘుచిత్రాన్ని ప్రారంభించారు. నెల్లూరులోని నవలాకులతోటలో వినాయకచవితి రోజున ఆ చిత్రానికి షూటింగ్ ప్రారంభమైంది కూడా. ఆ చిత్రం పోస్టర్‌ను ఇటీవల ప్రముఖ సినీ నటులు శివాజీరాజా హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ప్రకృతికి–పర్యావరణానికి ప్రాణప్రదమైన చెట్లను పరిరక్షించుకోవాలని, మనిషికి ప్రాణవాయువునిచ్చే చెట్లను సంరక్షించుకోవాలని, ఎవరి చిత్తానుసారం వారు చెట్లను నరకడం నేరమని–ఘోరమని, చెట్లను నాశనం చేసుకుంటే చివరికి మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమిస్తుందనే సందేశాత్మక ఇతివృత్తంతో ఈ లఘుచిత్రాన్ని ఆయన రూపొందిస్తున్నారు. ఇప్పటికే ‘ఆయన రచన–దర్శకత్వంలో పండుటాకులు’, ‘అమ్మంటే’.. వంటి షార్ట్‌ఫిల్మ్‌లు అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, తల్లిలాంటి చెట్లకు ఎవరూ హాని తలపెట్టకూడదని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ‘చెట్టు–తల్లి’ ద్వారా మరో అద్భుత చిత్రాన్ని ఆయన సృష్టించబోతున్నారు. లౌహిత్య సమర్పణలో, శ్రీకళాంజలి క్రియేషన్స్ ఆధ్వర్యంలో సమర్పించబోతున్న ఈ లఘుచిత్రంలో కెకెఆర్ మూర్తి, సఫియా పర్వేజ్, దువ్వూరు బెనర్జీ, ఉపేంద్ర ధీరజ్, శిరీష, గవాస్కర్, నాగమణి, నీలిమ నటిస్తున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త.. ‘శుభమస్తు’ షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వాసు ప్రత్యేక పాత్రలో కనిపించబోతున్నారు. కథ–మాటలు– దర్శకత్వం కళాంజలి అనంత్, గీత రచన మద్దూరు, సంగీతం చైతన్యకుమార్–సంగీత్ సౌరభ్, కెమెరా పి.విష్ణువర్ధన్‌రెడ్డి, సహకారం మునిచంద్ర–కళాంజలి సురేష్‌ల బృందం ఈ చిత్రానికి జీవం పోయనున్నారు. మన ప్రధాని నరేంద్రమోడీ ‘ప్రతిఒక్కరూ తల్లి పేరుతో మొక్కలు నాటాలని’ ఇచ్చిన పిలుపే స్ఫూర్తిగా ఈ లఘుచిత్రాన్ని రూపొందిస్తున్నట్లు అనంత్ ఈ సందర్భంగా చెప్పారు. ఏదేమైనా, సమాజానికి ఉపయోగపడే ఒక మంచి సందేశంతో త్వరలోనే మన ముందుకు రానున్న ‘చెట్టు–తల్లి’కి వందనాలు!. అనంత్‌కి శుభాభినందనాలు!..

## నెల్లూరు-తడ జాతీయ రహదారి
# విస్తరణకు కేంద్రం అనుమతి



- రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు

నెల్లూరు-తడ ఎన్‌హెచ్-16 రహదారి నాలుగు లేన్ల నుండి ఆరు లేన్లకు విస్తరించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ 110 కిలోమీటర్ల రహదారి విస్తరణకు త్వరలోనే టెండర్లు పిలువబోతున్నట్లు జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) తెలిపింది. ఆరులేన్ల రహదారి వలన ప్రయాణ సమయం, ప్రమాదాలు తగ్గింపు, పోర్టు కనెక్టివిటీ మెరుగుదల, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెరుగుదల ఉంటాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి మరియు విస్తరణపై ప్రగతి మరియు సమీక్షల బాధ్యతలను బీద మస్తాన్‌రావుయాదవ్‌కు అప్పగించిన నేపథ్యంలో, ఆయన రాజ్యసభలో ఆమేరకు ప్రశ్నలు అడగడం, జీరో అవర్‌లోను, ప్రత్యేక నోటీసులతోను ప్రస్తావించడం, లేఖలు వ్రాయడం వంటి అనేక మార్గాల్లో ఈ అంశంపై కృషి చేశారు. అలాగే ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ని ప్రత్యేకంగా కలసి సమస్యలు వివరించారు. ఈ ప్రాజెక్టు ఆమోదంలో పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకులు లావు శ్రీకృష్ణదేవరాయలుతో సహ పలువురు ప్రజాప్రతినిధులు విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు యాదవ్ మాట్లాడుతూ 2004లో రోజుకు 20వేల వాహనాలు నడిచిన ఈ రహదారిపై, 2023 నాటికి 40వేల వాహనాలు నడుస్తున్నాయని, ఈ రహదారి విస్తరణ వల్ల పెరుగుతున్న వాహన రద్దీ, ప్రమాదాల నియంత్రణ, కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం, పారిశ్రామిక కారిడార్లు, సెజ్‌లకు అనుసంధానం, మొదలగు సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. రహదారి విస్తరణకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి, అన్నివిధాల సహకరించిన కేంద్ర రోడ్లు రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీకి, ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మెన్ సంతోష్‌కుమార్ యాదవ్ తదితరులందరికీ బీద మస్తాన్‌రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

**- నివాళులర్పించిన రామ్‌కుమార్‌రెడ్డి -**

మాజీ ముఖ్యమంత్రి..మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమైనవని వెంకటగిరి వైకాపా నేత..నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 2న వెంకటగిరిలో జరిగిన డాక్టర్ వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆ మహానేతకు ఘన నివాళులర్పించారు. రాష్ట్రాభివృద్ధి-ప్రజా సంక్షేమ పాలనతో డాక్టర్ వైఎస్ ప్రజల గుండెల్లో శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రామ్‌కి..వైకాపా నాయకుల కృతజ్ఞతలు

వాకాడు, చిట్టమూరు, కోట మండలాలకు చెందిన పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు ఈనెల 1న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని వాకాడులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై నమ్మకంతో మండల కమిటీలో తమను నియమించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు చెప్పారు. పదవులు పొందినవారిని రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

## 6 నుంచి.. వేళాంగణి మాత ఉత్సవాలు

నెల్లూరుజిల్లా సముద్రతీరంలోని కొత్తకోడూరులో వెలసివున్న చర్చిలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు వేళాంగణి మాత ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ప్రార్థనలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు వేలసంఖ్యలో తరలివస్తారు కనుక, వారికి అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని నెల్లూరు బిషప్ డా.ఎం.డీ ప్రకాశం తెలిపారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని వేళాంగణిమాతను దర్శించుకోవాలని ఆలయ డైరెక్టర్ పీ.లూకాస్‌రాజ్ విజ్ఞప్తిచేశారు.

## ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో..
## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవాలు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో ఇటీవల జాతీయ క్రీడా దినోత్సవాలు మూడురోజుల పాటు ఘనంగా జరిగాయి. ఆగస్టు 31న జరిగిన ముగింపు కార్యక్రమంలో 30మంది విద్యార్థులతో సైకిల్ ర్యాలీని డాక్టర్ సి.రవీంద్రరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు, ర్యాలీ అనంతరం విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆగస్టు 29ని జాతీయ క్రీడా దినోత్సవంగా పాటిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 'ఏక్ ఘంటా ఖేల్ కే మైదాన్ మే' నినాదంతో మూడురోజుల పాటు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల కోసం క్రీడా పోటీలు, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కళాశాల సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగ అధిపతి డాక్టర్ సి.రవీంద్రరెడ్డి మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ భారత హాకీకి, దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో అందరికీ వినోదపు ఆటలు, ఉత్తేజకరమైన వాలీబాల్ ఆటల పోటీలను, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాలన్నీ విజయవంతంగా జరుగుతున్నాయని డైరెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. వ్యాయమ విద్యావిభాగం అధ్యాపకురాలు కె.శోభారాణి, అధ్యాపకులు పి.రాముకుమార్, ఇ.వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు.

## 22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు

శరన్నవరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 3న సంప్రదాయబద్ధంగా ఈ వేడుకల ప్రారంభానికి గుంజను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈ ఆలయంలో 51వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభమై అక్టోబరు 2వతేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఆలయ ఇఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఈ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.



## 13.50 లక్షలు పలికిన..లంబోదరుని లడ్డూ



వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గణేశుని ప్రసాదానికి వేసిన వేలంపాటల్లో భక్తులు పోటీపడి లడ్డూలను దక్కించుకున్నారు. నెల్లూరు బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్ వద్ద లంబోదర సెంటర్‌లో చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈనెల 1న లంబోదరుని లడ్డూ వేలం వేయగా, ఆ మహాప్రసాదం ఏకంగా పదమూడున్నర లక్షల రూపాయలు పలకడం విశేషం. తేజశ్విని గ్రాండ్, తేజు డెవలపర్స్ అధినేత తోట శ్రీనివాసులురెడ్డి వేలంపాటలో ఆ లడ్డూను దక్కించుకున్నారు.

## టూకీగా...



### మున్నంగిదిన్నెలో పౌష్టికాహార వారోత్సవాలు

కావలి రూరల్ సర్వాయపాళెం సెక్టార్ పరిధిలోని మున్నంగిదిన్నెలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### గండవరం వద్ద రోడ్డు ప్రమాదం..వ్యక్తి మృతి

కొడవలూరు మండలం గండవరం సబ్‌స్టేషన్ సమీపంలో ఈనెల 2వ తేదీ రాత్రి లారీ ఢీకొనడంతో, బైక్‌మీద వెళ్తున్న ఆలూరు ఈశ్వరయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. దగదర్తి మండలం ఊచగుంటపాళెం ఈశ్వరయ్య స్వస్థలం. కొడవడలూరు ఎస్ఐ కోటిరెడ్డి ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పాపిరెడ్డిపాళెంలో రైతులకు అవగాహన

తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెం గ్రామంలో ఈనెల 2న జిల్లా వ్యవసాయాధికారిణి శిరీషారాణి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి వ్యవసాయాన్ని లాభసాటిగా ఎలా చేసుకోవచ్చో రైతులకు అవగాహన కలిగించారు. వ్యవసాయశాఖ ఏడీఏ రాజకుమార్, సహాయ అధికారులు నర్సోజీరావు, పార్వతి, వినీల్, విద్యాసాగర్, సుమంత్ పాల్గొన్నారు.

### రంగనాయుడుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

సీతారామపురం మండలంలోని రంగనాయుడుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఈనెల 2న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను ఆకస్మికంగా పరిశీలించారు. మెనూ ప్రకారం గర్భిణులకు, బాలింతలు-చిన్నారులకు మంచి భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల బరువు, ఎత్తు కొలతలు తీసి పోషణ్ ట్రాకర్ యాప్‌తో పాటు, రిజిస్టర్లలో ఆ వివరాలను నమోదుచేయాలన్నారు.

### వడ్డిపాళెం రామాలయానికి పాతికవేల విరాళం

లింగసముద్రం మండలంలోని వడ్డిపాళెంలో జరుగుతున్న రామాలయ నిర్మాణానికి జనసేన పార్టీ నాయకుడు ఏ.నరసింహారావు ఈనెల 2న పాతికవేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. జనసేన అధినేత ..ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆ విరాళం అందించారు.

### ఇందుకూరుపేటలో సీఐటీయు కమిటీ

ఇందుకూరుపేట మండలంలో ఈనెల 2న సీఐటీయు మండల మహాసభ నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా కృష్ణమ్మ, ప్రధాన కార్యదర్శిగా షేక్ చాన్‌బాషాలతో పాటు 18మందితో కొత్త కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. సీఐటీయు జిల్లా అధ్యక్షులు టీవీవీ ప్రసాద్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### ఆల్తుర్తిలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

పొదలకూరు మండలంలోని ఆల్తుర్తి గ్రామంలో పేకాటాడుతున్న ఆరుగురిని ఈనెల 2న పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 8వేల రూపాయలతోపాటు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ హనీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి పేకాటరాయుళ్ళను పట్టుకుని కేసు నమోదు చేశారు.

### దొరువుపాడులో కొండచిలువ

చేజర్ల మండలం దొరువుపాడు గ్రామంలో ఓ వ్యక్తి ఇంటి వెనుక 12 అడుగుల పొడవున్న కొండచిలువ కనిపించడంతో గ్రామస్తులు భయపడిపోయారు. ఆదూరుపల్లి అటవీశాఖ వారికి సమాచారం అందించగా, వెంటనే అటవీ సిబ్బంది వచ్చి దానిని పట్టుకుని దూరంగా అటవీప్రాంతంలో వదిలారు.

### మాసాయిపేటలో పోలేరమ్మకి ప్రత్యేక పూజలు

ఉదయగిరి మండలం మాసాయిపేటలో వెలసిన గ్రామదేవత పోలేరమ్మకి ఈనెల 2న గ్రామస్తులు ప్రత్యేకపూజలు చేసి, గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి పొంగళ్ళు సమర్పించారు.

● నగరంలో నారాయణ

# నెల్లూరు నగరవాసులందరికీ త్వరలోనే... సురక్షిత తాగు నీరు

● మంత్రి నారాయణ హామీ



నెల్లూరు నగర ప్రజలకు త్వరలోనే పరిశుభ్రమైన సురక్షిత తాగునీరు అందిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. ఇటీవల ఆయన నెల్లూరులోని 14 డివిజన్ జగదీష్‌నగర్ పార్క్ వద్ద అదానీ ఫౌండేషన్ సౌజన్యంతో ఎన్టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరునగర ప్రజలకు సురక్షిత నీరు అందించడమే తన లక్ష్య మన్నారు. నగరంలో డిసెంబర్ నెలాఖరుకల్లా 'ఇంటింటికీ మంచినీటి పథకం' అందుబాటులోకి వస్తుందని చెప్పారు. నగర నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేస్తున్న మదర్‌ప్లాంట్ వల్ల రోజుకి లక్ష లీటర్ల తాగునీరు ఉత్పత్తి అవుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 3 మదర్ ప్లాంట్లను ప్రారంభించడం జరిగిందన్నారు. అదేవిధంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా దోమలు లేని నగరంగా నెల్లూరు రూపుదిద్దుకోబోతుం దని స్పష్టం చేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, నారాయణ అంటేనే అభివృద్ధి అని, అభివృద్ధి అంటే నారాయణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్‌తో పాటు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత విజయభాస్కర్‌రెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## 4.20 కోట్లతో.. కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్

నెల్లూరులో తొలిసారిగా అధునాతన టెక్నాలజీతో విద్యుత్ కంటైనర్ సబ్‌స్టేషన్ ఏర్పాటైంది. నగరంలోని 46వ డివిజన్ గాంధీ బొమ్మ వద్ద ఉన్న స్వతంత్ర పార్కులో 4 కోట్ల 20 లక్షల రూపాయల వ్యయంతో ఏపీ ఎస్పీడీసీఎల్ సౌజన్యంతో కంటైనర్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలసి దానికి ఇటీవల ప్రారంభోత్సవం చేశారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల నెల్లూరు నడిబొడ్డున ఉన్న గాంధీబొమ్మ సెంటర్, పొగతోట, ట్రంకురోడ్డు, తదితర ప్రాంతాలలో విద్యుత్ హెచ్చుతగ్గులు నిరోధించడానికి బాగా ఉపయోగపడుతుందన్నారు. ఇది పూర్తిగా రిమోట్ ఆధారిత సబ్ స్టేషన్ అని తెలిపారు.

## 15వ డివిజన్‌లో రోడ్డుకు ప్రారంభోత్సవం

నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 15వ డివిజన్లో రౌండ్ తూము వద్ద రోడ్డును మంత్రి నారాయణ 'నుడా' ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 45వ డివిజన్ నుంచి 15, 16 డివిజన్లకు రాకపోకలు సాగించేందుకు అనువుగా రౌండ్ తూము వద్ద రోడ్డును ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వం ఈ తూము వద్ద జరుగుతున్న పనులను కూడా ఆపేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దానిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. దీనివల్ల 15, 16 డివిజన్ల ప్రజలు 45వ డివిజన్‌లోకి రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుందని తెలిపారు.

## వేలాదిమందితో 'స్త్రీ శక్తి' ర్యాలీ...

రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయడంతో పాటు, ప్రజలకు సంక్షేమ పథకాలను కొరత లేకుండా అందిస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎంతో ఆదరం చూపిస్తున్నారు. తాజాగా ఇటీవల స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం పట్ల మహిళాలోకంలో సంతోషం పెల్లుబుకుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ పథకాలపై ఆనందంతో నెల్లూరు ప్రజలు స్పందించారు. 'సూపర్ సిక్స్–సూపర్‌హిట్' అంటూ నినాదాలు చేస్తూ, స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పప్పుల వీధి వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. దాదాపు 10వేల మందికి పైగా ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొనడం విశేషం. మంత్రి నారాయణ సతీమణి రమాదేవి ఆధ్వర్యంలో మహిళలు భారీసంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, నెల్లూరు సిటీ నియోజకవర్గ మహిళా క్లస్టర్లు కప్పిర రేవతి,విజయమ్మ, శ్రీలక్ష్మి, జానకి, మంజుల, శిల్పా, చందన, గౌసున్నీసా, బీజేపీ, జనసేన నేతలు, మహిళా కార్పొరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.






## గణపతి నిమజ్జనోత్సవం

వినాయకచవితి వేడుకల్లో భాగంగా గణేశ్ నిమజ్జనోత్సవం నెల్లూరు నగ రంలో నేత్రపర్వంగా జరిగింది. మంత్రి నారాయణ పాల్గొని, ఆ గణనాధుని చల్లని చూపుతో విఘ్నాలన్నీ తొలగిపోయి ఆంధ్ర ప్రదేశ్ రాష్టం సర్వతోముఖాభివృద్ధి చెం దాలని ఆకాంక్షించారు. నెల్లూరు పెన్నా ఘాట్‌లో అనేక కూడళ్ళ నుంచి గణేశ నిమజ్జోత్సవానికి గణనాథులు పెద్దఎత్తున భక్తజన సందోహంతో తరలివచ్చారు. పెన్నా నదితీరం వద్ద గణేష్ ఘాట్ వద్ద చేపట్టిన నిమజ్జనోత్సవ ఏర్పాట్లపై మంత్రి సంతృప్తి వ్యక్తంచేశారు. గణనా థుని ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆయు రారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని మంత్రి నారాయణ కోరుకున్నారు.

## నగరపాలక కార్యాలయంలో మంత్రి సమీక్ష

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యా లయంలో మంత్రి నారాయణ ఇటీవల ఎమ్మెల్యేలు, నుడా, కార్పొరేషన్ అధికారు లతో సమీక్ష నిర్వహించారు. గత వైకాపా ప్రభుత్వం అన్నివ్యవస్థలను సర్వనాశనం చేసిందని ఆయన ఈ సందర్భంగా మండి పడ్డారు. అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీ లని నిర్వీర్యం చేశారని, ఎలాంటి అభి వృద్ధి పనులు జరగకుండానే డబ్బులు డ్రా చేశారని దుయ్యబట్టారు. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యేలు కోరగా, త్వరలో విచారణ జరిపి చర్యలు తీసు కుంటామని మంత్రి తెలియజేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఆనంద్‌తో పాటు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణా రెడ్డి, కందుకూరి ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కోవూరులో ప్రశాంతమ్మ




# రైతుల బాగు కోసమే పనిచేయండి

● సొసైటీల ఛైర్మెన్లు, డైరెక్టర్లకు ఎమ్మెల్యే దిశానిర్ధేశం

రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారధ్యంలో కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని, ఆ స్ఫూర్తితో మీరు కూడా పనిచేయాలని సొసైటీల ఛైర్మెన్లు, డైరెక్టర్లకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దిశానిర్ధేశం చేశారు. ఇటీవల ఆమె విడవలూరులో విడవలూరు, పార్లపల్లి, వరిణి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఛైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని, వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. విడవలూరు సొసైటీ ఛైర్మన్‌గా పొన్నలూరు పురంధర్‌రెడ్డి, సభ్యులుగా చింతగింజల కృష్ణ, తిరకాల నాగేశ్వరరావు, పార్లపల్లి సొసైటీ ఛైర్మన్‌గా వేగూరు చంద్ర, సభ్యులుగా బత్తిన రామసుబ్బారెడ్డి, సిహెచ్ కామేశ్వరమ్మ, వరిణి సొసైటీ ఛైర్మన్‌గా కొడిమెర్ల వెంకటేశ్వర్లు, సభ్యులుగా నాటూరు విజయకుమార్, కుడుముల వెంకటస్వామి ఎమ్మెల్యే సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

## కొడవలూరులో 3.45 కోట్లతో అభివృద్ధి పనులు



కోవూరు నియోజక వర్గంలోని కొడవలూరు మండలంలో 3 కోట్ల 45 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టా మని ప్రశాంతిరెడ్డి తెలి పారు. కొడవలూరు మండలం యల్లాయ పాళెం గ్రామంలో 1 కోటి 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్ల ప్రారంభో త్సవం మరియు శంఖుస్థాపన కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. యల్లాయపాళెం గ్రామంలో 30 లక్షలతో నిర్మించిన అంతర్గత రోడ్లకు ఆమె ప్రారంభోత్సవం చేశారు. దాసరిపాళెం వద్ద మెయిన్ రోడ్డుకు 65 లక్షలతో, మరో 10 లక్షలతో ముస్లిం కాలనీలో రోడ్ల నిర్మాణాలకు ఆమె శంకుస్థాపనలు చేశారు.

## యువతకు క్రీడా కిట్లు..



యువతను క్రీడల్లో ప్రోత్సహించే ఉద్దేశంతో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఈనెల 3న కోవూరు మండల యువతకు క్రీడా కిట్లను అంద జేశారు. విపిఆర్ వికాస్ కార్యక్రమం కింద 30 క్రికెట్, 30 వాలీబాల్ కిట్లను అందించారు. ప్రశాంతమ్మ మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి యువత ఆటల్లో గెలిచేందుకు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు.

## టీడీపీలోకి చేరికలు...



బుచ్చి రూరల్ మండలం నాగమాంబాపురానికి చెందిన పలువురు వైకాపా నాయకులు ఈ నెల 4వ తేదీ గురువారం ఎమ్మెల్యే ప్రశాంతమ్మ సమక్షంలో టీడీపీలోకి చేరారు. ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధి పనులు, కోవూరు నియోజకవర్గంలో వేమిరెడ్డి దంపతులు చేస్తున్న ప్రజోపయోగ కార్యక్రమాలు చూసి తాము టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

## మృతుని కుటుంబీకులకు 5 లక్షల సాయం..



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కాకురుమూడి రమణయ్య కుటుంబానికి ఆర్థిక సాయంగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం 5 లక్షల రూపాయల చెక్కును పంపింది. ఆ చెక్కును ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మృతుని భార్య నాగరత్నకి అందజేశారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com